
RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

CITIZEN TIMES TELUGU DAILY



VOLUME: 17 | ISSUE: 239 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 25-3-2026 | Pages: 8 | Rs: 2/-

సంపుటి : 17 | సంచిక :239 | ఎడిటర్: కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 25-3-2026 | పేజీలు : 8 | రూ: 2/-

## 30 నిమిషాల జూమ్ కాల్..

# స్టీల్‌ప్లాంట్ తెచ్చింది...

### మంత్రి నారా లోకేశ్



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్**

ఆర్సెలార్ మిత్తల్ సీఈవో ఆదిత్య మిత్తల్‌తో 2024 సెప్టెంబరు 22 ఆదివారం రాత్రి 8.30 గంటలకు మాట్లాడిన 30 నిమిషాల జూమ్ కాల్.. రాష్ట్ర భవిష్యత్తును మార్చేసిందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఆ జూమ్‌కాల్ వల్లే దేశంలోనే అతి పెద్ద గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ప్లాంట్ మన రాష్ట్రానికి వచ్చిందన్నారు. ఏపీలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఈ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనే నిదర్శనమని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో లోకేశ్ మాట్లాడారు. 'ఇది కేవలం స్టీల్ ప్రాజెక్టు కాదు. మన బలం,

తరువాయి 2లో..

## ప్రస్తుతం సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయి - మోదీ

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అక్కడ యుద్ధం వల్ల అనేక సమస్యలు వస్తున్నాయని.. ఇది ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఇంధన సంక్షోభానికి దారితీసిందన్నారు. భారత్‌కు కూడా ఆందోళనకరంగా మారిందన్నారు. దేశంలో ముడి చమురు, గ్యాస్, ఎరువుల రవాణాకు ఆటంకం లేకుండా చర్యలు



తీసుకుంటున్నామని చెప్పారు. ప్రస్తుతం మనకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయన్నారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులపై రాజ్యసభలో మాట్లాడిన ఆయన.. భారత్‌కు హర్మూజ్ జలసంధి నుంచి కూడా చమురు నౌకలు వస్తాయని, అవి సురక్షితంగా మన పోర్టులకు చేరేలా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. "భారతీయుల భద్రతే ప్రథమ ప్రాధాన్యతగా

తరువాయి 2లో..

## ఎల్పీజీ ప్రత్యామ్నాయంపై

# దృష్టి పెట్టాలి

### శ్రీకాకుళం-కాకినాడ పైప్‌లైన్ పునరుద్ధరణకు చర్యలు

### పంట నష్టంపై నివేదికను రెండు రోజుల్లో ఇవ్వాలి

### ఆర్టీజీఎస్‌పై సమీక్షలో సీఎం చంద్రబాబు



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఎల్పీజీ సరఫరా సమస్యకు.. ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు మళ్లడమే సరైన పరిష్కారమని సీఎం చంద్రబాబు అన్నారు. పైప్డ్ నేచురల్ గ్యాస్(పీఎన్‌జీ), విద్యుత్ పరికరాల వినియోగం పెరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల పనితీరుపై సీఎం క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ 'రాష్ట్రంలో పీఎన్‌జీని 100 శాతం వినియోగించుకునేలా

తరువాయి 2లో..

## రైల్వే ప్రయాణికులకు అలర్ట్!

### టికెట్ క్యాన్సిలేషన్‌కు కొత్త రూల్స్



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

భారతీయ రైల్వే టికెట్ క్యాన్సిలేషన్ ఛార్జీల విషయంలో కీలక మార్పులు చేసింది. ట్రైన్ బయల్దేరే సమయం ఆధారంగా టికెట్ సొమ్మును రిఫండ్ చేసే విధానాన్ని సవరించింది. కొత్త రూల్స్ ప్రకారం 72 గంటల ముందు ఎవరైనా కన్ఫామ్ టికెట్‌ను రద్దు చేసుకుంటే పూర్తి మొత్తం రిఫండ్ (క్యాన్సిలేషన్ ఛార్జీలకు లోబడి) చేసేలా మార్పులు చేసింది. బోర్డింగ్ పాయింట్ నిబంధనలనూ మార్చింది. ఈ మేరకు కొత్తగా తీసుకొచ్చిన పలు సంస్కరణలను రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వివరించారు. ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 15 మధ్య దశలవారీగా ఈ మార్పులు అమలు చేయనున్నట్లు ప్రకటించారు.


**కొత్త రూల్స్ ఇలా..**

ప్రయాణానికి 72 గంటల ముందు టికెట్‌ను రద్దు చేసుకుంటే 'మ్యాగ్జిమమ్ రిఫండ్' చేస్తారు. కొంత క్యాన్సిలేషన్ ఛార్జీలను ఉపసంహరించుకుని మిగిలిన మొత్తాన్ని రిఫండ్ చేస్తారు. ట్రైన్

తరువాయి 2లో..

## 'కొవిడ్' నాటి విషాదాలను మోదీ మర్చిపోయారా?

### రాహుల్ గాంధీ



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ప్రధాని మోదీ పార్లమెంట్ ఉభయసభల్లో ప్రసంగించారు. ఈ సందర్భంగా 'కొవిడ్' ప్రస్తావన తీసుకొచ్చారు. దీనిపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పందిస్తూ ప్రధానిపై విమర్శలు గుప్పించారు. ప్రపంచవ్యాప్తంగా

తరువాయి 2లో..




### వేడిని పట్టుకుంది..

### పిచ్చుక దాడి చేసింది..

### భవితవ్యంపై సందేహాలు..

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఆర్థికంగానే కాదు... మిలటరీ శక్తిలో అగ్రరాజ్యం అమెరికా. ప్రపంచానికి పోలీసు అని చెప్పవచ్చు. ఎక్కడ అలజడి జరిగినా అక్కడకి వెళుతుంది. అమెరికా మిలట్రీ బడ్జెట్ కొన్ని దేశాల బడ్జెట్ కన్నా ఎక్కువగానే ఉంటుంది. భారీ యుద్ధనౌకలు, రాడార్లు సైతం పసిగట్టలేని స్టెల్త్ విమానాలు వీరి అమ్ములపొదిలో ఉన్నాయి. అమెరికా వద్ద ఉన్న ఎఫ్-35 యుద్ధవిమానం శత్రువుల రాడార్లకు చిక్కదు. దీంతో శత్రుదేశాల గగనతలాలపై స్వేచ్ఛగా విహరించి దాడులు చేయగలదు. ఇది అమెరికా వద్ద ఉన్న బ్రహ్మాస్త్రం. ఈ విమానం ధర వందల కోట్లలో ఉంటుంది. అయితే పిచ్చుక లాంటి ఇరాన్ ఉష్ణాన్ని పసిగట్టే ఇన్ఫ్రారెడ్ క్షిపణి (మాజిద్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ) దీనిపై దాడిచేసిందన్న

తరువాయి 2లో..

## రైతు రుణమాఫీ మా పరిశీలనలో లేదు

### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టీకరణ




**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

రైతు రుణాలను మాఫీ చేసే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వ పరిశీలనలో లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. లోక్‌సభలో ఓ ప్రశ్నకు ఆమె సోమవారం ఈ మేరకు రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. అన్నదాతల ఆర్థిక

తరువాయి 2లో..

## లోక్‌సభ.. అసెంబ్లీ స్థానాలు 50% పెంపు



**2029 ఎన్నికల నుంచి అమల్లోకి!**

**అప్పుడు తెలంగాణలో 179,**

**ఏపీలో 263 శాసనసభ సెగ్మెంట్లు**

**దేశంలో 543 నుంచి 816కి లోక్‌సభ స్థానాలు**

**ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు**

**ఎన్డీయే భాగస్వాములకు చెప్పిన అమిత్‌షా**

**ముందుగానే మహిళా రిజర్వేషన్ కోటా**

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను 50% పెంచాలని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ బిల్లును ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ప్రవేశపెట్టడానికి సిద్ధమైనట్లు తెలిసింది. దీని ప్రకారం పార్లమెంటు స్థానాలు 543 నుంచి 816కి చేరుతాయి. 4,123 ఉన్న అసెంబ్లీ స్థానాలు 6,185 అవుతాయి. తెలంగాణ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 179కి, ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం

తరువాయి 2లో..

## నియోజకవర్గాల పునర్విభజనతో మరిన్ని అవకాశాలు: పవన్ కల్యాణ్



**విజయవాడ**

నియోజకవర్గాల పునర్విభజన వల్ల అవకాశాలు మరింత పెరుగుతాయని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. విజయవాడలోని ఓ ప్రైవేటు

తరువాయి 2లో..

## ఎడిటోరియల్

# ప్రధాని మోదీ బిగ్ టాస్క్..

ఐదు రాష్ట్రాల ఎన్నికల వేళ ప్రధాని మోదీ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలకు ఎన్నికల బాధ్యతలు అప్పగిస్తున్న ప్రధాని మోదీ ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై పెద్ద భారమే మోపారని ప్రచారం జరుగుతోంది. ఈ ఇద్దరినీ రెండు రాష్ట్రాలను అప్పగించి ఆ రాష్ట్రాల్లో ఎన్డీఏను గెలిపించాలనే టాస్క్ అప్పగించారని అంటున్నారు. ఏపీలో చంద్రబాబు, పవన్ తో చేతులు కలిపిన బీజేపీ కేంద్రంలోనూ అధికారం నిలబెట్టుకుంది. అంతేకాకుండా సార్వత్రిక ఎన్నికల తర్వాత జరిగిన ప్రతి ఎన్నికలోనూ గెలుస్తూ వస్తోంది. ఈ క్రమంలో బీజేపీకి అందని ద్రాక్షగా ఊరిస్తున్న పశ్చిమ బెంగాల్, తమిళనాడులో నవ చరిత్ర లిఖించేందుకు ప్రధాని మోదీ వ్యూహరచన చేస్తున్నారని అంటున్నారు. పశ్చిమ బెంగాల్ లో బీజేపీ ఒంటరిగా పోటీ చేస్తుండగా, తమిళనాడులో అన్నాడీఎంకేతో పొత్తుపెట్టుకుని పోటీ చేస్తోంది. ఈ రెండు పెద్దరాష్ట్రాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవాలని ప్రధాని మోదీ పట్టుదల ప్రదర్శిస్తున్నారని అంటున్నారు. ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లో మూడు చోట్ల పరిస్థితి ఎన్డీఏకి అనుకూలంగా లేదని ఓపీనియన్ పోల్స్ ఫలితాలు వెల్లడిస్తున్న నేపథ్యంలో ప్రధాని మోదీ అప్రమత్తయ్యారని అంటున్నారు. దీంతో హిట్ పెయిర్ గా పేరు గడించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సేవలను సమర్థంగా వాడుకోవాలని ప్రధాని మోదీ యోచిస్తున్నారని అంటున్నారు. చంద్రబాబు వ్యూహరచన, పవన్ సినీ గ్లామర్ ఎన్నికల్లో పనిచేస్తుందని ప్రధాని మోదీ విశ్వసిస్తున్నారని అంటున్నారు. దీంతో ఇద్దరికి రెండు కీలక రాష్ట్రాల బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించుకున్నారని అంటున్నారు. పశ్చిమ బెంగల్ లో కోల్ కతా, ఖరగ్ పూర్ నగరాల్లో తెలుగు వారు కూడా ఎక్కువగా నివసిస్తుంటారు. ఎక్కువగా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వలస వెళ్లిన వారే ఆ రెండు నగరాల్లో నివసిస్తున్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతం దశాబ్దాలుగా టీడీపీకి కంచుకోట కావడంతో ప్రధాని మోదీ వ్యూహాత్మకంగా చంద్రబాబుకు పశ్చిమ బెంగాల్ బాధ్యతలు అప్పగించారని అంటున్నారు. అంతేకాకుడా బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వ్యూహాలకు దీటుగా చంద్రబాబు పనిచేయగలరని బీజేపీ అగ్ర నాయకత్వం యోచిస్తోందని చెబుతున్నారు. అదేవిధంగా పవన్ సినీ గ్లామర్ ఉపయోగించుకుని తమిళనాడులో లబ్ధి పొందాలని బీజేపీ ప్రయత్నిస్తున్నట్లు విశ్లేషిస్తున్నారు. తమిళనాడు ఎన్నికల్లో సినీ గ్లామర్ ఎక్కువగా పనిచేస్తుందని గతంలో జరిగిన అనేక ఎన్నికలు రుజువు చేశాయి. ప్రస్తుతం పోటీ పడుతున్న అధికార డీఎంకే కూటమికి డిప్యూటీ సీఎం ఉదయనిధికి సినీ రంగంతో అనుబంధం ఉంది. ఈ కూటమికి సీనియర్ నటుడు కమలహాసన్ కూడా మద్దతుగా నిలుస్తున్నారు. అదేవిధంగా కొత్తగాపార్టీ పెట్టిన ప్రముఖ హీరో విజయ్ సైతం ఓటర్లను ఆకర్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్నాడీఎంకే కూటమి కోసం పవన్ ను ఉపయోగించుకోవాలని బీజేపీ అగ్రనాయత్వం ప్లాన్ చేసిందని అంటున్నారు. గతంలో మహారాష్ట్ర, ఢిల్లీ ఎన్నికల్లో పవన్, చంద్రబాబు ప్రచారం చేశారు. ఆయా ఎన్నికల్లో బీజేపీ గెలుపొందింది. దీంతో ఈ సారి కూడా చంద్రబాబు, పవన్ సేవలను వాడుకోవాలని ప్రధాని మోదీ భావిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా రాజకీయంగా కంట్లో నలుసులా మారిన పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ను గద్దె దించాలని, బీజేపీ పాలనను మరింత విస్తరించాలని ప్రధాని కంకణం కట్టుకున్నారని చెబుతున్నారు. ఇక ప్రధాని మోదీ మోపిన ఈ బాధ్యతలను పవన్, చంద్రబాబు ఎంతవరకు నెరవేర్చగలరనేది ఉత్కంఠ రేపుతోంది.

## రైతు రుణమాఫీ మా పరిశీలనలో లేదు

స్థితిగతులను బలోపేతం చేసేందుకు సర్కారు అనేక చర్యలు తీసుకుందన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు (కేసీసీ) ద్వారా వారికి రాయితీ వడ్డీరేట్లపై రూ.3 లక్షల వరకూ రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తే.. సవరించిన వడ్డీ రాయితీ పథకం (ఎంఐఎస్ఎస్) కింద అదనపు ప్రోత్సాహకాలూ ఇస్తున్నామని చెప్పారు. రిజర్వు బ్యాంకు జారీ చేసిన ప్రాధాన్యరంగ రుణాల మార్గదర్శకాల ప్రకారం అనుబంధ కార్యకలాపాల రుణాలతో సహా పూచీకత్తు లేని స్వల్పకాలిక వ్యవసాయ రుణాలను రూ.1.60 లక్షల నుంచి రూ.2.00 లక్షలకు ప్రభుత్వం పెంచిందన్నారు. వ్యవసాయం సహా ఆర్థిక వ్యవస్థలోని ప్రాధాన్య రంగాలకు బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి తగినంత రుణ ప్రవాహం ఉండేలా చూస్తున్నామని పేర్కొన్నారు. పీఎం-కిసాన్ పథకం కింద రైతులకు నేరుగా నగదు బదిలీతో పాటు పంటల బీమా అందిస్తున్నామని వెల్లడించారు.

## ఎల్పీజీ ప్రత్యామ్నాయంపై

# దృష్టి పెట్టాలి

చూడాలి. జిల్లాకు కనీసం 10 వేలకు తగ్గకుండా కొత్త కనెక్షన్లు ఇవ్వాలి. శ్రీకాకుళం-కాకినాడ పైప్‌లైన్ పునరుద్ధరణపై కేంద్రమంత్రికి లేఖ రాయాలి. ఏపీ సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌కు వెంటనే ఉత్తర్వులివ్వాలి. వచ్చే క్యాబినెట్ సమావేశానికల్లా నేచురల్ గ్యాస్ పాలసీ ఫర్ ప్రమోషన్ ఇన్ కమర్షియల్ సెక్టార్ విధానాన్ని తీసుకురావాలి. గ్యాస్ సంక్షోభం.. విద్యుత్ రంగానికి ఒక అవకాశం. ఇండక్షన్ స్టవ్‌లు, ఎలక్ట్రిక్ కుక్కర్లను ప్రత్యామ్నాయ వనరుగా వినియోగించేలా చూడాలి. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీలు, అన్న క్యాంటీన్లు, హోటళ్లకు ప్రాధాన్య క్రమంలో ఎల్పీజీ సిలిండర్ల పంపిణీ జరిగేలా చూడాలి. అకాల వర్షాల కారణంగా జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి ఈ నెల 26 కల్లా నివేదిక ఇవ్వాలి' అని ఆదేశించారు. గత ఐదు రోజులుగా గృహావసరాల కోసం రోజుకు సగటున 1.80 లక్షల సిలిండర్లు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. మరో 14,444 టన్నుల గ్యాస్ నిల్వలు ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో పీఎన్జీ విస్తరణకు 2.34 లక్షల కనెక్షన్లు అందుబాటులో ఉన్నప్పటికీ 60 వేల మందికే అందించినట్లు అధికారులు వివరించారు.

**సాంకేతికతతో తిరుమలలో పెరిగిన దర్శనాలు**

సాంకేతికతను వినియోగించడంతో తిరుమలలో దర్శనాల సంఖ్య పెరిగిందని సీఎం చెప్పారు. 'తిరుమలలో క్యూలైన్లు, భక్తుల రద్దీ నిర్వహణను ఏఐ సాయంతో చేపట్టడంవల్ల నిరీక్షణ సమయం తగ్గింది. 20 శాతం మంది భక్తులకు అదనంగా దర్శనాలు చేసుకునే అవకాశం లభించింది. ఇప్పుడు తిరుమలలో ప్రసాదం, దర్శనంపై.. శ్రీవారి సేవకులు, భక్తుల్లో సంతృప్తి పెరిగింది. అత్యాధునిక ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ద్వారా తిరుమల ప్రసాదాల్లో పోషక విలువలు, పదార్థాల నాణ్యతలను తనిఖీ చేస్తున్నాం. భవిష్యత్‌లో కల్తీకి ఆస్కారం ఉండదు. మిగిలిన శాఖలూ మెరుగైన ప్రజా సేవలకు ఏఐ ఇంటిగ్రేషన్‌పై దృష్టి పెట్టాలి. డ్రోన్ల వినియోగం ద్వారా సాగువ్యయం తగ్గించి, ఉత్పత్తి పెరిగేలా చూడాలి. డ్రోన్ల వినియోగంపై పొరుగు రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనంచేయాలి. రాష్ట్రంలో బ్యాండ్ విడ్త్ పెంచేలా చర్యలు చేపట్టాలి' అని అన్నారు. సమావేశంలో మంత్రి పార్థసారథి, అధికారులు ఉన్నారు. మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్‌లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

## 30 నిమిషాల జూమ్ కాల్..

# స్టీల్‌ప్లాంట్ తెచ్చింది...

ధైర్యం, నమ్మకం. 2019 జనవరిలో దావోస్‌లో నేను ఆదిత్య మిత్తల్‌ను కలిసేందుకు ప్రయత్నించా. అప్పుడు సమయం ఇవ్వలేదు. టాటా గ్రూప్ నైట్‌క్యాంప్‌లో ఆయన్ను కలిసి ఏపీలో ఎందుకు పెట్టుబడులు పెట్టరని అడిగా. ఆయన మేం ఇప్పటికే మరో రాష్ట్రాన్ని చూస్తున్నామన్నారు. అది జరగకపోతే ఏపీ మీ కోసం సిద్ధంగా ఉందని చెప్పా. ఆ తర్వాత 2024లో ప్రజలు పట్టం కట్టాక ఒక్కరోజు కూడా వృథా చేయకుండా వేగంగా సాగుతున్నాం. ఈ తరుణంలో ఆదిత్య మిత్తల్‌తో మాట్లాడిన కాల్ రాష్ట్రానికి వరంగా నిలిచింది' అని లోకేశ్ అన్నారు.

రికార్డు సమయంలో.. 'ప్రపంచ స్థాయి కంపెనీలను ఆకర్షించి, రికార్డు సమయంలో ప్రాజెక్టులు మొదలుపెట్టే సామర్థ్యానికి ఈ స్టీల్‌ప్లాంట్ శంకుస్థాపనే మచ్చుతునక. 2024 సెప్టెంబరులో ఆదిత్యతో మొదటి జూమ్ కాల్ జరిగింది. తర్వాత రెండు నెలల్లో ఈ ప్రాజెక్టుకు ప్రోత్సాహకాలు అందించాం. మూడు నెలల్లో భూమి ఇచ్చాం. 11 నెలల్లో పర్యావరణ, అటవీ అనుమతులు లభించాయి. ఇది రికార్డు స్థాయి బిజినెస్ వేగం. దేశంలో ఇంతటి భారీ ప్రాజెక్టుకు అత్యంత వేగంగా అనుమతులు అందించినందుకు గర్వంగా ఉంది. అత్యాధునిక సాంకేతికతతో హైగ్రేడ్ స్టీల్ ఉత్పత్తి చేసే ఈ ప్రాజెక్టు అనకాపల్లిని ప్రపంచపటంలో ప్రత్యేకంగా నిలుపుతుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి సవాళ్లు ఎదురైనప్పుడు ఎన్ఎండీసీతో సమన్వయం, స్లర్రీ పైపులైన్ అనుమతుల విషయంలో సీఎం వ్యక్తిగతంగా శ్రద్ధ తీసుకున్నారు. కేంద్రంతో మాట్లాడి, ప్రధానమంత్రి కార్యాలయంతో సమన్వయం చేసి వాటిని సాధించారు. డబుల్ ఇంజిన్ బుల్లెట్ రైల్ సర్కారు వేగాన్ని ఈ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటే సూచిస్తోంది. ఈ ప్రాజెక్టు ఇక్కడికి రావడానికి కారణం.. ప్రోత్సాహకాలు, పాలసీలు కాదు, బ్రాండ్ సీబీఎన్.

**ఆ తల్లి మాటలే ప్రేరణ**

నెల్లూరు నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర చేస్తున్నప్పుడు రోడ్డు పక్కన బజ్జీలు వేస్తున్న ఓ మహిళతో మాట్లాడాను. భర్త మద్యానికి బానిసై చనిపోయినా.. పని చేస్తూ ఇద్దరు కుమారులను చదివించానని, వారికి ఉద్యోగాలు ఇవ్వండని ఆమె కోరారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తానని చేసిన ప్రకటనకు ఆమె మాటలే ప్రేరణ. ఈ భూమిపూజ నా జీవితంలో ఎంతో భావోద్వేగ ఘట్టం. యువతకు నేనిచ్చిన హామీ కార్యరూపం దాల్చుతున్నందుకు గర్వంగా ఉంది' అని లోకేశ్ సంతోషం వ్యక్తం చేశారు.

# లోక్‌సభ.. అసెంబ్లీ స్థానాలు 50% పెంపు

ఉన్న 175 ఎమ్మెల్యే స్థానాలు 263కి చేరుతాయి. లోక్‌సభ స్థానాలు ఏపీలో 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కి చేరే అవకాశం ఉంటుంది. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని సోమవారం సాయంత్రం ఎన్డీయే సమావేశంలో భాగస్వామ్య పక్షాలకు కేంద్రం చెప్పింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, న్యాయశాఖమంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్‌ల నేతృత్వంలో ఈ భేటీ జరిగింది. కాంగ్రెసేతర విపక్షాలతోనూ విడిగా భేటీ నిర్వహించారు. కాంగ్రెస్‌తోనూ షా మాట్లాడే అవకాశం ఉంది. నియోజకవర్గాల సంఖ్య పెంచడానికి వీలుగా ముందుగా మహిళా రిజర్వేషన్ చట్టం, డీలిమిటేషన్ చట్టాలకు సవరణలు ప్రతిపాదిస్తూ ఈ పార్లమెంటు సమావేశాల్లో బిల్లులు తీసుకురాబోతున్నట్లు తెలిసింది. లోక్‌సభలో ఇందుకు సంబంధించిన బిల్లు ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుచేసి చకచకా సీట్ల పెంపు కార్యక్రమం పూర్తిచేసి 2029 ఎన్నికల్లో అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. సీట్ల పెంపు దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కూడా పెరుగుతాయని సమాచారం.

**ప్రాథమిక జనాభా లెక్కల వివరాలతోనే..**

2023 సెప్టెంబరులో ఆమోదించిన బిల్లు ప్రకారం 2034 నుంచి మహిళలకు 33% రిజర్వేషన్లు అమల్లోకి రావాలి. రాజ్యాంగ అధికరణలు 170(3), 81(3) ప్రకారం.. 2026 తర్వాత ప్రచురించే జనాభా లెక్కల ఆధారంగా దేశంలో నియోజకవర్గాల పునర్విభజన చేయాలని నిబంధన ఉంది. అందువల్ల కేంద్రం మహిళా రిజర్వేషన్ల అమలును 2034 నుంచి అమల్లోకి తేనుంది ఇదివరకు భావించారు. ఇప్పుడు జనగణన 2027 మార్చి 1కల్లా పూర్తికానుండటంతో ప్రాథమిక జనాభా లెక్కల వివరాలు ప్రకటించి.. ఆ వెంటనే నియోజకవర్గాల పునర్విభజన చేపటొచ్చు. ఈ అంశంపై అన్ని పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు మొదలుపెట్టింది. జనగణన తర్వాత అందులో వచ్చిన లెక్కల ఆధారంగా దామాషా ప్రకారం సీట్ల పెంపునకు అనుమతిస్తే ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య తేడా వచ్చే అవకాశం ఉందని తొలినుంచి దక్షిణాది రాజకీయపార్టీలు ఆందోళన వ్యక్తంచేస్తున్న నేపథ్యంలో.. అన్ని రాష్ట్రాల్లో సగటున లోక్‌సభ, అసెంబ్లీ సీట్లు 50% పెంచాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీనివల్ల అన్ని రాష్ట్రాలకూ ఇప్పుడున్న రాజకీయ ప్రాతినిధ్యం యథాతథంగా కొనసాగే అవకాశం ఉంటుందని సమాచారం. ప్రభుత్వ ప్రతిపాదనపై స్పందించడానికి రాజ్యసభలో విపక్షనేత మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో మంగళవారం విపక్షనేతలు సమావేశం కానున్నారు.

## మధ్యాహ్న భోజన నాణ్యతపై ఎమ్మెల్యే అకస్మిక తనిఖీ

### స్వయంగా రుచి చూసి అధికారులకు కీలక ఆదేశాలుజారీ

**గన్నవరం:( సిటిజన్ టైమ్స్ ): మార్చి 24**

విద్యార్థులకు అందించే మధ్యాహ్నం భోజనం రుచిగా శుచిగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏపీ ప్రభుత్వ విప్ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ఆదేశించారు . మంగళవారం ఆయన ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రూరల్ మండలం నిడమానూరు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో అమలు అవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. పాఠశాలకు చేరుకున్న ఎమ్మెల్యే నేరుగా భోజనశాలకు వెళ్లి, విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహారాన్ని స్వయంగా పరిశీలించారు. ఆహారం నాణ్యతను పరిశీలించిన ఆయన, విద్యార్థులతో కాసేపు ముచ్చటించి భోజనం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలల్లో విద్యార్థులకు అందించే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం కేవలం కడుపు నింపడమే కాకుండా, అది రుచిగా, అత్యంత శుచిగా ఉండేలా నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ



తీసుకోవాలని సూచించారు. ఆహార నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. భోజనం సిద్ధమైన తర్వాత విద్యార్థులకు వడ్డించే ముందు, ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరిగా ఆ ఆహారాన్ని రుచి చూసి నాణ్యతను ధృవీకరించాలని ఆయన ఆదేశించారు.

## మొదటి పేజీ తరువాయి

## ప్రస్తుతం సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయి - మోదీ

తీసుకున్నాం. అక్కడ చిక్కుకున్న మన వారిని సురక్షితంగా తీసుకొచ్చాం. ఇప్పటివరకు 3.75లక్షల మంది భారతీయులు సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చారు. దాడుల్లో కొంతమంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. గల్ఫ్ దేశాలతో నిరంతరం చర్చలు జరుపుతున్నాం. అన్ని సమస్యలకు చర్చలు, సంప్రదింపులే ఏకైక పరిష్కార మార్గం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## 'కొవిడ్' నాటి విషాదాలను మోదీ మర్చిపోయారా?

మహమ్మారి విరుచుకుపడిన సమయంలో జరిగిన విషాదాల గురించి మర్చిపోయారా? అని ప్రశ్నించారు. పార్లమెంట్ కాంప్లెక్స్‌లో మీడియాతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ.. ప్రధాని ప్రసంగంపై స్పందించారు. "మన విదేశాంగ విధానాలను మోదీ తన వ్యక్తిగత విధానాలుగా మార్చారు. మోదీ రాజీ పడితే.. మన విదేశాంగ విధానం కూడా రాజీ పడినట్టే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మోదీ రాజీకొచ్చినట్లే కన్పిస్తోంది" అని ఆరోపించారు.

## రైల్వే ప్రయాణికులకు అలర్ట్!

బయల్దేరడానికి 72 గంటల నుంచి 24 గంటల మధ్య టికెట్ రద్దు చేస్తే 'స్టాండర్డ్ పెనాల్టీ' విధిస్తారు. టికెట్ ధరలో 25 శాతం మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని (కనీస ఛార్జి ఆధారంగా) రిఫండ్ చేస్తారు. ట్రైన్ బయల్దేరడానికి 24 గంటల ముందు నుంచి 8 గంటల మధ్య టికెట్ రద్దు చేసుకుంటే 'లేట్ క్యాన్సిలేషన్'గా పరిగణించి 50 శాతం ఫేర్‌ను మినహాయించి మిగిలిన మొత్తం రిఫండ్ చేస్తారు. ప్రయాణానికి 8 గంటల ముందు గానీ, ట్రైన్ బయల్దేరిన తర్వాత ఎవరైనా టికెట్ రద్దు చేసుకుంటే ఎలాంటి రిఫండ్ ఉండదు. దీంతో పాటు ప్రయాణానికి 30 నిమిషాల ముందు వరకు బోర్డింగ్ పాయింట్ మార్చుకునే సదుపాయాన్నీ రైల్వేశాఖ కల్పించింది. ముఖ్యంగా నగరాల్లో ఎక్కువ స్టేషన్లు ఉన్నప్పుడు ఈ వెసులుబాటును ప్రయాణికులు ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతానికి చార్ట్ ప్రిపేర్ చేయడానికి ముందు వరకు మాత్రమే అనుమతిస్తున్నారు. గతంలో కౌంటర్ టికెట్‌ను రద్దు చేసుకోవాలంటే రైలు ప్రారంభమయ్యే స్టేషన్‌లో మాత్రమే వెసులుబాటు ఉంది. ఇకపై ఏ స్టేషన్‌లోనైనా క్యాన్సిల్ చేసుకోవచ్చు. అలాగే, ఇ-టికెట్ కలిగిన ప్రయాణికులు టికెట్ డిపాజిట్ రిసీట్ (ఠఐ=) ఫైల్ చేయాలంటే మాన్యువల్‌గా చేయాల్సి వచ్చేది. ఇకపై ప్రయాణికుడి ప్రమేయం లేకుండా టీడీఆర్ రూల్స్‌ను అనుసరించి ఆటోమేటిక్‌గా రిఫండ్ చేస్తారు. కౌంటర్ టికెట్‌పై ప్రయాణానికి 30 నిమిషాల ముందు కూడా ఇకపై ప్రయాణ తరగతిని అప్‌గ్రేడ్ చేసుకునే వెసులుబాటును కల్పిస్తున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

**క్యాన్సిలేషన్ ఛార్జీలు ప్రస్తుతం ఇలా..**

ప్రస్తుతం రైలు బయల్దేరడానికి 48 గంటల ముందు టికెట్ రద్దు చేసుకుంటే ఏసీ ఎగ్జిక్యూటివ్/ ఏసీ ఫస్ట్ క్లాస్ ప్రయాణికుల నుంచి రూ.240ం జీఎస్టీ; ఏసీ 2 టైర్/ ఫస్ట్‌క్లాస్‌కు రూ.200ం జీఎస్టీ; ఏసీ త్రీటైర్/ ఏసీ ఛైర్ కార్/ ఏసీ ఎకానమీ తరగతి టికెట్లకు రూ.180ం జీఎస్టీ చొప్పున క్యాన్సిలేషన్ ఛార్జీలు విధిస్తున్నారు. స్లీపర్ క్లాస్‌కు రూ.120, సెకండ్ క్లాస్‌కు రూ.60 చొప్పున వసూలు చేస్తున్నారు. అదే ప్రయాణానికి 48 గంటల నుంచి 12 గంటల ముందైతే 25 శాతం, 12 గంటల నుంచి 4 గంటల మధ్య 50 శాతం టికెట్ ధరను మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని రిఫండ్ చేస్తున్నారు. ప్రయాణానికి 4 గంటల కంటే తక్కువ సమయం ఉంటే రిఫండ్‌ను అనుమతించడం లేదు.

## బ్రహ్మాస్త్రాన్ని కొట్టిన పిచ్చుక..

వార్తలు సంచలనంగా మారాయి

**వేడిని పట్టుకుంది.. పిచ్చుక దాడి చేసింది..**

ఎంత అధునాతన ఆయుధమైనా వాటికి కొన్ని పరిమితులు, బలహీనతలు ఉంటాయి. ఎంత రాడార్ల కన్నుగప్పినప్పటికీ ఇంజిన్ బాగా వేడిగా ఉంటుంది. ఇక్కడే ఇరాన్ దెబ్బకొట్టింది. ఆకాశంలో వస్తున్న విమాన ఇంజిన్ ఉష్ణోగ్రతలను గుర్తించింది. వెంటనే ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థతో దాడి చేసింది. ఫలితంగా దెబ్బతిన్న విమానం కిందవున్న ఎయిర్‌బేస్‌లో అత్యవసరంగా దిగాల్సివచ్చింది. ఇన్‌ఫ్రారెడ్ సెర్చ్ అండ్ ట్రాక్ సెన్సార్లను ఇరాన్ వాడి ఉండవచ్చన్న అనుమానాలను అమెరికా నిఘావర్గాలు వ్యక్తంచేస్తున్నాయి.

**భవితవ్యంపై సందేహాలు..**


ఎఫ్-35 విమానాలంటే ఆకాశంలో రారాజు అని చెప్పుకుంటారు. వీటిని దాదాపు 20 దేశాలు వినియోగిస్తున్నాయి. ఖరీదైన ఈ విమానాల్లో మూడు వేరియంట్స్ ఉన్నాయి. ఇరాన్‌పై దాడుల్లో ఇజ్రాయెల్ వీటినే ఉపయోగించి ఆధిపత్యం సాధించింది. మరి ఇలాంటి విమానమే దాడికి గురైందన్న వార్తలు వీటి భవితవ్యంపై సందేహాలు వ్యక్తంచేస్తున్నాయి. అయితే అమెరికా ఈ వార్తలను ధ్రువీకరించలేదు.

## నియోజకవర్గాల పునర్విభజనతో మరిన్ని అవకాశాలు: పవన్ కల్యాణ్

హోటల్‌లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో ఆయన సుమారు మూడు గంటలకు పైగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. సభ్యత్వ నమోదు, పార్టీ కమిటీలపై చర్చించారు. నియోజకవర్గాల్లో సమస్యలపై ఆరా తీశారు. కమిటీల ఏర్పాటు విషయంలో పిఠాపురం మోడల్‌ని మిగతా నియోజకవర్గాల్లోనూ అమలు చేయాలని సూచించారు. కూటమి పార్టీల సయోధ్య విషయంలో దిశానిర్దేశం చేశారు.

# గత పొరపాట్లకు తావివ్వొద్దు

### చందనోత్సవం సమీక్షలో గంటా



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్ మార్చి 24**

సింహాచలేశుని చందనోత్సవంలో ఈసారి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. చందనోత్సవంపై మంగళవారం కలెక్టరేట్ లో జరిగిన సమీక్షలో ఆయన జూమ్ ద్వారా పాల్గొన్నారు. గత ఏడాది చందనోత్సవం ముందు రోజు రాత్రి 11 గంటలకు గానీ రూ. 1,500, రూ. 1,000 టికెట్ల జారీ చేయలేదని, అలాంటి ఘటనలు పునరావృతం కానివ్వద్దని పేర్కొన్నారు. జారీ చేసే టికెట్లు కనీసం 3 రోజుల ముందు ఇవ్వగలిగితే దానికి తగ్గట్టు భక్తులు ప్రణాళికను రూపొందించుకుంటారని చెప్పారు. టికెట్ల జారీలో గందరగోళం కారణంగా డూప్లికేట్ ఆరోపణలు కూడా వచ్చాయన్నారు. ఎక్కువ రేటు టికెట్ల కొనుగోలు చేసిన వారికి క్యూ లైన్లలో ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ఎన్ని టికెట్ల ప్రింట్ చేశారు.. ఎన్ని పంపిణీ చేశారు.. అనే లెక్క ఖచ్చితంగా ఉండాలని, గత ఏడాది టికెట్ల వ్యత్యాసం ఇంకా తేలలేదన్నారు. తెల్లవారుజామున తొలి దర్శనం గంట ముందు జరిగేట్టు చూస్తే భక్తులకు గంట అదనంగా స్వామి వారి నిజరూప దర్శన అవకాశం కల్పించవచ్చని వివరించారు. చందనం గట్టిగా ఉంటే తొలి దర్శనం ఆలస్యమవుతుందని అర్చకులు తెలిపారు. ఉదయం అంతరాలయ దర్శనం ఒక గంటకు పరిమితం చేయాలని.. అవసరమైతే సాయంత్రం అరగంట పునరుద్ధరించ వచ్చన్నారు. పూర్తి స్థాయి ఈఓ ఉన్నందున ఈసారి చందనోత్సవం సమర్ధంగా నిర్వహించాలని చెప్పారు.

# ఈ నెల 28న జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశము

### జడ్పీ సీఈవో పి. నారాయణమూర్తి

**విశాఖపట్టణం, సిటిజన్ టైమ్స్, మార్చి 24**

ఈనెల 30న జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఛైర్పర్సన్ అధ్యక్షతన స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో జరుగు తుందని జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి. నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సర్వసభ్య సమావేశం 28వ తేదీ శనివారం ఉదయం 10.30 గంటల నుంచి సమావేశ మందిరం వేదికగా కొనసాగుతుందని సభ్యులు, అధికారులు భాగస్వామ్యమై విజయవంతం చేయాలని కోరారు. ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపీపీలు, అధికారులు సమావేశాలకు హాజరుకావాలని ఆ ప్రకటన లో కోరారు.

# కాకినాడ జిల్లాలోని అక్రిడిటెడ్ జర్నలిస్టుల కోసం మార్చి 26న ఉచిత వైద్య పరీక్షల శిబిరం

**కాకినాడ బ్యూరో ఇన్చార్జ్ సిట్జన్ టైమ్స్ మార్చి 24**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ, సమాచార పౌర సంబంధ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అక్రిడిటెడ్ పాత్రికేయులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రత కొరకు నిర్వహిస్తున్న ఉచిత వైద్య పరీక్షల శిబిరం సేవలను కాకినాడ జిల్లాలోని అర్హులైన జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఒక ప్రకటనలో కోరారు . ఈ వైద్య శిబిరం మార్చి 26 గురువారం, ఉదయం 08.00 గం.ల నుండి కాకినాడ, రామారావు పేట, రాజా ట్యాంకు ఎదురుగా గల రాఘవ 24 హెచ్ ఆర్ ఎస్.ఎమర్జెన్సీ హాస్పిటల్ నందు నిర్వహించడం జరుగుతుందని సమాచార శాఖ ఇన్చార్జి డిప్యూటీ డైరక్టర్ ఆర్.వి.ఎస్.రామచంద్రరావు తెలియజేశారు. జర్నలిస్టులు తమ అక్రిడిటేషన్ కార్డులు, ఆధార్ కార్డు వివరాలతో వచ్చి వైద్య శిభిరం సేవలను పొందాలని ఆయన కోరారు. ఈ హెల్త్ కాంప్ లో వైద్యపరీక్షలు, మందులు ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు. వైద్య శిభిరానికి హాజరైయ్యే జర్నలిస్టులు నమోదు ప్రక్రియ ఉదయం 8.00 గంటలకు ప్రారంభమవుతుందని, వైద్య పరీక్షల నిమిత్తం జర్నలిస్టులు ఎటువంటి ఆహారం తీసుకోకుండా ఖాళీ కడుపుతో రావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.జె.నర్సింహనాయక్ తెలిపారు. ఈ శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలు, జనరల్ మెడిసిన్, రక్తపోటు పరీక్షలు, జనరల్ సర్జరీ, రక్తంలో చక్కెర పరీక్షలు, గుండె సంబంధిత పరీక్షలు, వైద్య సేవలు, హిమోగ్లోబిన్ పరీక్షలు, దంత వైద్యం, ఈసీజీ పరీక్షలు, ,ఆర్థోపెడిక్స్, 2డి ఎకో, టి వైద్యం,నేత్ర పరీక్షలు, పిల్లల వైద్యం, గైనకాలజీ, ఎక్స్ రే, చర్మ వ్యాధుల చికిత్స, లిపిడ్ ప్రొఫైల్, మానసిక వైద్యం, ఆర్ ఎఫ్ టి, ఎల్ ఎఫ్ టి, థైరాయిడ్ పరీక్షలు వంటి సుమారు 60 రకాల పరీక్షలను ఆయా విభాగాల్లో నిపుణులైన వైద్యులు అందిస్తారని డిఎంహెచ్ఓ తెలియజేశారు. ఆయా పరీక్షలు, చికిత్సలకు అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రత్యేక చికిత్స అవసరమైన వారిని ప్రభుత్వ ఆసుపత్రులకు రిఫర్ చేస్తామని తెలిపారు. వైద్య శిబిరం నిర్వహణకు ప్రత్యేక వైద్య బృందాలు, పారామెడికల్ సిబ్బంది మరియు మొబైల్ వైద్య వాహనాలు ఏర్పాటు చేసామన్నారు. వైద్య శిభిరానికి హాజరైయ్యే జర్నలిస్టులకు, కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షల అనంతరం అల్పాహారం తమ ఆసుపత్రిలో అందిస్తామని వైద్య శిభరం నిర్వహణలో సహయ సహకారాలు అందిస్తున్న రాఘవ 24 గంటల ఎమర్జెన్సీ ఆసుపత్రి చైర్మన్ డా.నెక్కంటి నగేష్ బాబు తెలియజేశారు. జర్నలిస్టులు, వారి కుటుంబాల సంక్షేమం లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక వైద్య శిభిరాన్ని జిల్లాలోని అక్రిడిటెడ్ జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని ,తమతో పాటు ఆధార్ కార్డు తమతో పాటు అందుబాటులో ఉంచుకోవాల్సిందిగా సమాచార శాఖ డిడి రామచంద్రరావు, డిఎంహెచ్ఓ డా.నరశింహనాయక్ సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు.

# వైస్సార్సీపీ నాయకులకు గిరిజనులు సవాల్




విశాఖ వైస్సార్సీపీ అధ్యక్షుడు కేకే రాజు చేసిన ఆరోపణలు ఖండించిన శ్రీ కృష్ణాపురం గిరిజనులు

మాకు సహాయం చేస్తున్న ఎమ్మెల్యే రామక్రిష్ణ బాబు పైన ఆరోపణలు తగదు

గత వైస్సార్సీపీ ప్రభుత్వం లో విజయ సాయి రెడ్డి వల్ల అన్యాయం జరిగింది


ఇప్పుడు మీరు చేస్తున్న ఆధారాలు లేని ఆరోపణలు వలన మాకు అన్యాయం జరుగుతుంది.

గిరిజనులు అంటే వైస్సార్సీపీ పార్టీ కి చిన్న చూపా

మీ దగ్గర ఆధారాలు ఉంటే తీసుకొని రండి లేనిపక్షంలో క్షమాపణలు చెప్పాలని గిరిజనులు డిమాండ్

మచ్చ లేని నాయకుడు ఎమ్మెల్యే రామక్రిష్ణ బాబు అంటున్న గిరిజనులు

రహస్యం లేక వెలగపూడి ని ఎదుర్కొనే ధైర్యం లేక బురద చల్లుతున్నారా దీనిలో నిజమేంత?శ్రీకృష్ణా పురం లో జరుగుతున్న మరిన్ని కబ్జాలు పైన పూర్తి వివరాలు తో ప్రచురణ చేయబడును.




**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 24**

విశాఖపట్నం సమీపంలోని శ్రీ కృష్ణాపురం లో గిరిజన భూముల అంశం తీవ్ర రాజకీయ వివాదానికి దారితీసింది. వైసీపీ నాయకులు చేసిన భూ కబ్జా ఆరోపణలను గిరిజనులు తీవ్రంగా ఖండిస్తూ, "ఆధారాలు ఉంటే బయట పెట్టండి, లేకపోతే బహిరంగ క్షమాపణ చెప్పాలి" అని స్పష్టం చేశారు. ఈ వివాదానికి మూలాలు 1974లో దారపాలెం లో జరిగిన అగ్నిప్రమాదం వరకు వెళ్తాయి. ఆ సమయంలో గిరిజన తండా దెబ్బతినడంతో 66 కుటుంబాలకు శ్రీకృష్ణాపురంలో భూములు కేటాయించబడ్డాయి. ప్రతి కుటుంబానికి ఒక ఎకరం సాగు భూమి, ఇంటి స్థలం కేటాయించడంతో పాటు వ్యవసాయం కోసం పశువులు, పరికరాలు, కుటుంబం కి ఒక గేద, 10 గొర్రెలు, 1 గొర్రె పోతు కూడా అందజేయబడ్డాయి. అప్పటి నుంచి గిరిజనులు ఈ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. తరువాత ఐటిడిఏ ఆధ్వర్యంలో గిరిజన పిల్లల కు స్కూల్ కూడా నిర్మించారు.అయితే గతంలో వైసీపీ ప్రభుత్వం సమయంలో, వైసీపీ నాయకుడు విజయ సాయి రెడ్డి ప్రభావంతో సుమారు 10 ఎకరాలను గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఆధీనంలోకి తీసుకుని ఇసుక యార్డ్‌గా వినియోగించారని గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రక్రియలో గిరిజనులకు ఎటువంటి నష్టపరిహారం ఇవ్వలేదని, పైగా పట్టాలు రద్దు అయ్యాయని చెప్పినట్లు వారు పేర్కొన్నారు. ఇటీవల విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు నేపథ్యంలో భూముల స్వాధీనం ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సమయంలో గిరిజనులు స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు ను ఆశ్రయించగా, ఆయన సమస్య పరిష్కారానికి ముందుకు వచ్చాడని తెలిపారు. పలు సర్వేలు, గ్రామ సభలు, కమిటీ పరిశీలనల తరువాత 47 మంది మాత్రమే లీగల్ పట్టాదారులుగా అధికారులు గుర్తించారు. దీని తరువాత జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పలు దఫాలుగా సర్వేలు నిర్వహించబడ్డాయి. రెవెన్యూ అధికారులు, సచివాలయం సిబ్బంది గ్రామానికి వెళ్లి ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించడంతో పాటు సంబంధిత పత్రాలను పరిశీలించారు. గ్రామ సభలు నిర్వహించి గిరిజనుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అంతేకాకుండా ఎమ్మెల్యే, కలెక్టర్, గిరిజన ప్రతినిధులతో కలిసి ఒక కమిటీ ఏర్పాటు చేసి మరలా సమగ్ర సర్వే నిర్వహించారు. ఈ సర్వేల ఫలితంగా మొత్తం 66 కుటుంబాల స్థానంలో ప్రస్తుతం 47 మంది మాత్రమే లీగల్ పట్టాదారులుగా ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. మిగిలిన కుటుంబాల వారసత్వంపై స్పష్టత లేకపోవడంతో వారికి పట్టాలు ఇవ్వడం సాధ్యం కాదని అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, రైల్వే జోన్ అవసరాల కోసం మొత్తం భూమిలో 52 ఎకరాలను మాత్రమే స్వాధీనం చేసుకుంటూ, మిగిలిన భూమి వదిలివేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

ఈ నేపథ్యంలో వైసీపీ నాయకుడు కెకె.రాజు, మాజీ డిప్యూటీ మేయర్లు "శ్రీకృష్ణాపురంలో గిరిజనులు లేరు, గిరిజనుల పేరుతో టీడీపీ దళారులు కబ్జాలు చేస్తున్నారు" అని చేసిన వ్యాఖ్యలపై గిరిజనులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. " మేమే గిరిజనులం, దశాబ్దాలుగా ఇక్కడే నివసిస్తున్నాం. గిరిజనులంటే చిన్న చూపా? మా ఉనికినే ప్రశ్నించడం ఎంతవరకు సమంజసం, ఆధారాలు ఉంటే తీసుకుని రండి, లేకపోతే వెంటనే క్షమాపణ చెప్పాలి" అని గిరిజనులు స్పష్టం చేశారు. అదేవిధంగా ఎమ్మెల్యే వెలగపూడి పై వచ్చిన ఆరోపణలను కూడా వారు ఖండిస్తూ, "మచ్చలేని నాయకుడు రామకృష్ణ బాబు. గిరిజనుల సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు వచ్చిన వ్యక్తిపై అసత్య ఆరోపణలు చేయడం తగదు" అని పేర్కొన్నారు. ఇక గిరిజనులను రెచ్చగొట్టే విధంగా తప్పుడు ఆరోపణలు కొనసాగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరిస్తూ, "మా భూములపై అన్యాయం జరిగితే వైసీపీ పార్టీ కార్యాలయాల ముందు భారీ ధర్నాలు నిర్వహిస్తాం" అని గిరిజనులు ప్రకటించారు. అయితే ఈ ఆరోపణలను గిరిజనులు, స్థానిక నాయకులు పూర్తిగా ఖండిస్తూ, తమ హక్కులను కాపాడుకునేందుకు చివరి వరకు పోరాడతామని స్పష్టం చేశారు. "గిరిజనులకు చెందాల్సిన భూముల్లో ఎటువంటి అన్యాయం జరిగినా మేము ఊరుకోము. అవసరమైతే వైసీపీ కార్యాలయాల ముందు పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తాం" అని గిరిజనులు మరియు స్థానిక నాయకులు హెచ్చరించారు. ప్రస్తుతం ఈ అంశం రాజకీయంగా మరింత వేడెక్కుతుండగా, ఈ వివాదంపై తదుపరి పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. ఇంకో సంచిక లో 47 మంది ఎవరు, రెవిన్యూ, జీవీఎంసీ వారు చేసిన పూర్తి సర్వే వివరాలు, వైస్సార్సీపీ చేస్తున్న ఆరోపణలు వెనుక ఉన్న




# ప్రజల ఆరోగ్యానికి చిహ్నంగా యోగాంధ్ర మెమోరియల్

### రూ.69.55 లక్షల అంచనా వ్యయంతో మెమోరియల్ ప్రారంభోత్సవంలో ఇన్చార్జి మంత్రి స్వామి



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 24**

ప్రజల ఆరోగ్య చిహ్నంగా, యోగా గుర్తుగా యోగాంధ్ర మెమోరియల్ నిలవనుందని జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. ఈస్ట్ జోన్ పరిధిలోని వార్డు నెం.21లో బీచ్ రోడ్డులో ఉన్న యోగా విలేజ్‌లో నిర్మించిన యోగాంధ్ర మెమోరియల్‌ను మంగళవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, విష్ణుకుమార్ రాజు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఇతర అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విశాఖ నగర ప్రజలు క్రమశిక్షణతో అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. ఆ సహకారమే విశాఖపట్నంలో పరిశ్రమల స్థాపనకు, ఉత్తరాంధ్ర అభివృద్ధికి, విశాఖ ఎకనామిక్ రీజియన్ డెవలప్‌మెంట్ బోర్డు వంటి కార్యక్రమాల విజయానికి మూలకారణమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, అలాగే తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నాయకులు ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఉద్ఘాటించారు. ప్రధానమంత్రి సందర్శించిన ఈ ప్రాంతానికి గుర్తుగా విక్టరీ ఎట్ సీ అమరవీరుల స్మారక చిహ్నం వద్ద నౌకాదళం శౌర్య గాథలను భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా, అలాగే ఆరోగ్య ప్రాధాన్యతను తెలియజేసేలా ఈ యోగా చిహ్నాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ మెమోరియల్ ఏర్పాటుతో యోగా విలేజ్ ప్రాంతం మరింత ఆకర్షణీయంగా మారడంతో పాటు ప్రజలకు సుందరమైన విశ్రాంతి వాతావరణం అందుబాటులోకి రానుందన్నారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో స్థానిక యోగా విలేజ్ సమీపంలో సుమారు రూ.69.55 లక్షల అంచనా వ్యయంతో ఈ మెమోరియల్ నిర్మాణం చేపట్టారు. పింక్ శాండ్ స్టోన్‌తో మెమోరియల్ నిర్మాణంతో పాటు విగ్రహం ఏర్పాటు, ఫ్లోరింగ్ పనులు పూర్తి చేశారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా జైపూర్ శాండ్ స్టోన్‌తో 2505 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఫ్లోరింగ్, జోధ్‌పూర్ శాండ్ స్టోన్‌తో శిల్ప నిర్మాణం, కార్పెట్ గడ్డితో ల్యాండ్‌స్కేపింగ్, ఫోకస్ లైటింగ్ ఏర్పాటు వంటి పనులు నిర్వహించారు. ఈ పనులకు జీవీఎంసీ సాధారణ నిధుల నుంచి వ్యయం చేయగా, ఎం/ఎస్ సెవెన్ హిల్స్ అసోసియేట్స్ సంస్థ పనులను చేపట్టింది. కార్యక్రమంలో జీవీఎంసీ ఏడీసీలు రమణ మూర్తి, సత్యవేణి తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ క్రమంలో పద్మనాభం ప్రాంతానికి చెందిన యోగా క్రీడాకారిణి యోగాసనాలు వేశారు. అతిథులంతా ఆమెను సత్కరించారు.

# డ్వాక్రా ఎగ్జిబిషన్ సందర్శించిన ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ



**కాకినాడ,సిటిజన్ టైమ్స్, మార్చ్ 24**

గవర్నమెంట్ ఐ.టి.ఐ ప్రాంగణంలో డి.ఆర్.డి.ఏ- సెర్ప్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా ఎగ్జిబిషన్ ను మంగళవారం రాత్రి ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ సందర్శించారు. అనంతరం ఎగ్జిబిషన్ కళావేదిక యందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాకినాడ ప్రభుత్వ ఐటిఐ అవరణలో ఈనెలాఖరు వరకు నిర్వహించే డ్వాక్రా బజార్ లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి మహిళా పారిశ్రామిక వేత్తలు వివిధ రకాల ఉత్పత్తులు మార్కెటింగ్ కోసం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ లో చేనేత వస్త్రాలు, హస్త కళా వస్తువులు, గృహ అలంకరణ వస్తువులు లభిస్తాయనీ, ఈ మహిళా పారిశ్రామిక ట్రేడ్ ఫెయిర్ ను సందర్శించి మహిళా ఉత్పత్తులను, మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని ఆమె కోరారు.

# కింగ్ జార్జి హాస్పిటల్‌లో సీటీవీఎస్ సేవలు ప్రజలకు ప్రాణాధారం

## పేదల ఆరోగ్యానికి అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోంది...

## జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 24**

కింగ్ జార్జి ఆసుపత్రిలో కార్డియో థొరాసిక్ ఌ వాస్క్యులర్ సర్జరీ విభాగం ఉత్తరాంధ్ర ప్రజలకు ప్రాణాధారంగా నిలుస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. కార్డియాలజీ విభాగంలో ఐసీఐసీఐ బ్యాంకు ఫౌండేషన్ అందించిన సమారు రూ.2 కోట్ల ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన హార్ట్ లంగ్ మిషన్, హీమోథర్మ్ ను మంగళవారం సాయంత్రం ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రా మెడికల్ కాలేజీలో కార్డియాలజీ విభాగం 1995--98 కాలంలో ప్రారంభమై, 2000కు ముందే ఓపెన్ హార్ట్ సర్జరీలు ప్రారంభమవడం గొప్ప చారిత్రాత్మక అంశమని గుర్తుచేశారు. అయితే హార్ట్ లంగ్ మెషిన్ పాడైపోవడంతో కొంతకాలం ఇబ్బందులు ఎదురైనప్పటికీ, స్థానిక ఎమ్మెల్యే వంశీ ద్వారా సమస్య తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సానుకూలంగా స్పందించి ఐసీఐసీఐ బ్యాంకు వారిని సంప్రదించగా, వారు సీఎస్సార్ ద్వారా హార్ట్ లంగ్ మెషిన్‌ను విరాళంగా అందజేయడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం కార్డియాలజీ విభాగంలో రెగ్యులర్‌గా శస్త్రచికిత్సలు జరుగుతున్నాయని తెలిపారు. క్యాథ్ ల్యాబ్ అప్‌గ్రేడేషన్‌ను కూడా సీఎస్సార్ ద్వారా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై స్పష్టమైన దృష్టితో పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. సంజీవని ప్రాజెక్టును రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ప్రజల ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేయడంతో పాటు హెల్త్ అలర్ట్స్ ద్వారా ప్రాణాలు కాపాడే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే ఎన్టీఆర్ వైద్య సేవ కింద కవరేజ్ లేని చికిత్సలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థికంగా అండగా ఉంటున్నామని గుర్తు చేశారు. కార్పొరేట్ సంస్థలు పేదల కోసం ఖర్చు చేయడం అభినందనీయమన్నారు. గతంలో డయాలసిస్ యూనిట్లు వంటి సదుపాయాలు కూడా విరాళాల ద్వారా కేజీహెచ్ లో అభివృద్ధి చేసినట్లు గుర్తు చేశారు. త్వరలోనే క్యాథ్ ల్యాబ్‌ను కూడా అప్‌గ్రేడ్ చేస్తామని చెప్పారు. ప్రస్తుతం కేజీహెచ్ లో బైపాస్ సర్జరీలు విజయవంతంగా నిర్వహిస్తున్నారని, అవసరమైతే గుండె మార్పిడి శస్త్రచికిత్సలు చేసే సదుపాయం కూడా అందుబాటులో ఉందని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజల గుండె చప్పుడుగా, ప్రాణ రక్షక కేంద్రంగా కేజీహెచ్ నిలుస్తోందన్నారు. కార్డియో థొరాసిక్ విభాగంలో మహిళా వైద్యులు అధికంగా ఉండటం విశేషమని, వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల ఐసీఐసీఐ ఫౌండేషన్ సహకారంతో ఆధునిక పరికరాలు ఏర్పాటు చేయడంతో పాటు, రెండు కొత్త ఆపరేషన్ థియేటర్లు ప్రారంభించబడ్డాయి. దీని ద్వారా మరింత ఎక్కువ మంది పేద మరియు ఆర్థికంగా బలహీన వర్గాల రోగులకు సేవలు అందుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద ప్రతి నెల సుమారు రూ.25 నుంచి 30 లక్షల విలువైన శస్త్రచికిత్సలు ఉచితంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, ఐసీఐసీఐ బ్యాంకు ఫౌండేషన్ ప్రతినిధులు శివ కుమార్ చిట్టిపోలు, శ్రీవర్ధన్ బోబెపల్లి, పక్కి వెంకట సాయి శంకర్, ఎం. రజనీకాంత్ రెడ్డి, కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ బి.వి. రమణ, సూపరింటెండెంట్ ఐ. వాణి, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

## అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన సుధారాణి





**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 24**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన చిక్కం సుధారాణి. ఆమెతో పాటు కమిటీ డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేసినారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ రైతులకు అన్నివేళలా అందుబాటులో ఉండి వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ద్వారా వచ్చే అన్ని సబ్సిడీలు పూర్తిస్థాయిలో రైతులకు అందేలా కృషి చేస్తానని, వ్యవసాయ రంగానికి ఉమ్మడి ప్రభుత్వం ఎంతో ప్రాముఖ్యత ఇస్తుందని ,రైతే ఈ దేశానికి వెన్నుముకని తెలిపినారు. ఎంతో నమ్మకంతో చైర్మన్ పదవికి ఎంపిక చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, విద్యాశాఖ మంత్రి లోకేష్ కి, జిల్లా ఇన్చార్జి మంత్రి అచ్చం నాయుడు కి, స్థానిక మంత్రివర్యులు సుభాష్ కి, పార్లమెంటు సభ్యులు గంటి హరీష్ మాధురికి, శాసనసభ్యులకు కృతజ్ఞతలు తెలిపినారు, ఈ కార్యక్రమంలో ఉమ్మడి పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, వ్యవసాయ అధికారులు, అధిక సంఖ్యలో పాల్గొని చైర్మన్ చిక్కం సుధారాణి డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు.

## శ్రీ విఘ్నేశ్వరుని హుండి ఆదాయం 36 లక్షలు





**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ మార్చి 25**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి స్వయంభు శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి హుండి 56 రోజులకు లెక్కింపు చేసినట్లుగా సహాయ కమిషనర్ కార్య నిర్వహణ అధికారి ఎం సత్యనారాయణ రాజు తెలిపారు. ఆలయ ప్రధాన హుండీల నుండి నగదు .రు30,35,547/- లు, అన్నప్రసాదం హుండీ నుండి నగదు రు.1,12,890/- లు మొత్తం రు.31,48,437/- వచ్చినవి. బంగారం 500 మీ.గ్రా,వెండి 118 గ్రా,విదేశీ కరెన్సీ నోట్లు 12 వచ్చినట్లు తెలిపారు. పర్యవేక్షణాధికారులు జంపా రామలింగేశ్వర రావు, తనిఖీదారు, దేవదాయశాఖ అమలాపురం,అర్చక స్వాములు, గ్రామస్థులు, గ్రామ పెద్దలు, ఆలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, పత్రికా ప్రతినిధులు భారతీయ స్టేట్ బ్యాంక్, ముక్తేశ్వరంవార్లు పాల్గొన్నారు.

# ముస్లింలకు వాసుపల్లి రంజాన్ కానుక

## ముస్లిం నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ కలయిక

## స్వీట్ బాక్స్ లు రూ. 15000 తోఫా అందజేసిన దక్షిణ మాజీ ఎమ్మెల్యే

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 24:**

రంజాన్ పండుగ మహోత్సవ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ దక్షిణ వైసిపి ముస్లిం నేతలు కార్యకర్తలతో ఆత్మీయ కలయక నిర్వహించారు. పండుగ అనంతరం కార్యాలయంలో వారితో కాసేపు ముచ్చటించారు. రూ.15,000తో పాటుగా స్వీట్ బాక్సులను రంజాన్ తోఫాగా అందజేశారు. కులమతాలకు అతీతంగా ఉన్న దక్షిణ నియోజకవర్గంలో ముస్లిం సోదరులతో ఉన్న తన బంధం బాల్యం నాటిదని గుర్తు చేశారు. ఇక్కడే పెరిగి చదువుకున్న నియోజకవర్గంలో ముస్లిం సోదరులు చూపిన ప్రేమ ఆప్యాయలతో ఎమ్మెల్యేగా రెండుసార్లు గెలిచానని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి అందించిన సహాయ సహకారాలతో స్థానిక ముస్లింలకు సముచిత స్థానం కల్పించామన్నారు. అలాగే దర్గాలు, ముస్లిం సోదరుల సమస్యలు అభివృద్ధి కార్యక్రమాలకి తన వంతు కృషి చేశానని మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. మళ్లీ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంకై ఎదురుచూస్తున్న వారికి మంచి రోజులు రానున్నాయని ఈ సందర్భంగా వాసుపల్లి జోష్యం చెప్పారు. అల్లా చూపిన దాతృత్వం ధార్మిక, చింతన, పేదవారికి సాయం చేయడం అల్లా చూపిన మార్గమని అన్నారు. స్నేహం సామరస్యాలను పెంపొందించే అన్ని మతాల పండుగలు దక్షిణ నియోజకవర్గంలో కనిపిస్తాయన్నారు. సంపాదించిన దానిలో కొంత భాగం పేదలకు సాయం చేయమని పవిత్ర గ్రంథం ఖురాన్ చెబుతుందన్నారు. ఉపవాసం దీక్షలు విరమణ సందర్భంగా తోచిన రీతిలో పేదలకు సాయం చేయాలనీ ఖురాన్ లో



బోధించారని గుర్తు చేశారు. ప్రతి ఒక్క ముస్లిం సోదరుడు సంవత్సరంలో తన సంపాదనలో 2.5% జకాత్ ఇస్తారని, ఆదర్శంగా తాను కూడా ఈ సహాయం అందించినట్లు వెల్లడించారు పేదలను ఆదుకోవడం లోనే సంతృప్తి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. గత వైసీపీ సర్కార్ హయాంలో ఇమామ్ లకు గౌరవ వేతనాలు అందాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వం హయాంలోనే ముస్లిం ల అభివృద్ధి కి జగన్ ఎంతగానో కృషి చేసారాని కొనియాడారు. 39 వ వార్డు అధ్యక్షులు ముజీబ్ ఖాన్, స్టేట్ మాజీ డైరెక్టర్ షబీర బేగం,36 వార్డ్ అధ్యక్షుడు మహమ్మద్ షకీల్, సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు బాబ్జి, (మహమ్మద్ యాసీన్), సమక్షంలో ముస్లిం వైసీపీ కార్యకర్తలకు ఈ తొఫాను అందజేయడం జరిగిందని వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో దక్షిణ వైసీపీ సీనియర్ నాయకులు కార్యకర్తలు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# మొగలమూరుకు విచ్చేసిన మాజీ మంత్రి ఆర్కే రోజా



**అల్లవరం సిటిజన్ టైమ్స్ మార్చి 24**

అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ ఆహ్వానం మేరకు అల్లవరం మండలం మొగలమూరు గ్రామానికి వైఎస్ఆర్సిపి మాజీ మంత్రి ఆర్ కె. రోజా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమెకు మాజీ ఎంపీ చింతా అనురాధ ఘనంగా స్వాగతం పలికారు.

## 65 వేల రూపాయలు ఆర్థిక సహాయం

**ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ మార్చి 24**

మండలం లోని ,అయినాపురం గ్రామం,కోమటిచెరువు వద్ద నెల క్రితం గుత్తాల సోనాక్షి(తల్లిదండ్రులు రాంబాబు, రమ్య)అనే నాలుగు సంవత్సరాల పాప ప్రమాదవశాత్తు ఆడుకుంటూ పొయ్యిలో పడి ముఖం మొత్తం కాలిపోయి చికిత్స నిమిత్తం ఆర్థిక భారం ఎక్కువగా ఉన్నందువలన వీళ్ళ కష్టాలు సాధనాల ఆనంద్ ద్వారా తెలుసుకున్న సూరపురెడ్డి సురేష్,,వానపల్లిపాలెం గ్రామ యువత సహకారంతో 40,000/,అయినాపురం గ్రామ యువత సహకారంతో 20,000/జనసేన నాయకులు గుద్దటి జమీ గోదసి పుండరీష్ సహకారంతో 5000/-, మొత్తంగా 65 వేల రూపాయలు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు చేతుల మీదుగా ఇవ్వటం జరిగింది. దీనికి గాను పాప తల్లిదండ్రులు దాతలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్ విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే ఇతర నాయకులు భవిష్యత్తులో పాపకి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు గుత్తుల సాయి, కూటమి ప్రభుత్వ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డులలో 465 సేవలు

## గ్రామ,వార్డు కార్య దర్శుల అనధికార డిప్యుటేషన్లు రద్దు చేయాలి.

## ఏకీకృత కుటుంబ సర్వే వల్ల ప్రజలకు ఎలాంటి నష్టం ఉండదు.

## ప్రజలు సహకరించాలి-జిల్లా ఇంచార్జి మంత్రి -డా.బాల వీరాంజనేయ స్వామి

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 24:**

స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డుల్లో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే ధ్యేయంగా సంబంధిత అధికారులు పనిచేయాలని జిల్లా సాంఘిక సంక్షేమ, జి ఎస్ డబ్ల్యూ ఎస్ , జిల్లా ఇన్చార్జి మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లో స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డుల పని తీరుపై ఇన్చార్జి మంత్రి స్వామి జోనల్ కమిషనర్లు, ఎంపీడీవోలు ,సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేందిర ప్రసాద్, స్వర్ణ గ్రామ,స్వర్ణ వార్డు డైరెక్టర్ శివప్రసాద్, ప్రభుత్వ విప్ గణబాబు , విష్ణు కుమార్ రాజు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఏకీకృత కృత కుటుంబ సర్వే, పి4,బంగారు కుటుంబాలు, ఆధార్, ఈ కేవైసీ, కేపిఐ, వాట్సాప్ గవర్నెన్స్ తదితర అంశాలపై సమీక్ష చేశారు. ఈ సమావేశంలో మంత్రి స్వామి మాట్లాడుతూ గ్రామ స్వర్ణ వార్డులు వచ్చిన తరువాత మొదటి సమావేశం విశాఖపట్నం లో నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ వార్డు కార్యదర్శుల ద్వారా 465 సేవలను ప్రజలకు అందిస్తున్నామన్నారు. స్వర్ణ గ్రామ వార్డుల్లో పని చేసేవారు ప్రజలకు సేవలు అందించడమే



లక్ష్యంగా పని చేయాలన్నారు. రాబోయే ఆరు నెలల్లో స్వర్ణ గ్రామ వార్డులకు హద్దులు నిర్ణయిస్తామన్నారు. గ్రామ వార్డు కార్యదర్శుల అనధికార డిప్యూటేషన్లు రద్దుచేసి తిరిగి వారినీ యధా స్థానాల్లో నియమించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏకీకృత కుటుంబ సర్వే తప్పులు లేకుండా పూర్తి చేయాలని,తప్పులు జరిగితే తగిన చర్యలు తీసుకుంటామని



హెచ్చరించారు. ఈ సర్వే వల్ల ప్రజలకు ఎలాంటి నష్టం ఉండదని, ప్రభుత్వ అధికారులు చేస్తున్న సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. కుటుంబ సర్వే, వాట్సాప్ సేవలు, మనమిత్ర ఆధార్ తదితర వాటిపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేసి అవగాహన కల్పించాలని కోరారు. ఎంపీడీవోలు జోనల్ అధికారులు, జిల్లా అధికారులు సమర్ధవంతంగా పర్యవేక్షణ చేసి ప్రజలకు వీలైనంత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిఎస్డబ్ల్యూఎస్ అధికారి ఉషారాణి, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ సత్యవేణి, జోనల్ అధికారులు, ఎంపీడీవోలు,పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతు సేవ కేంద్రాల ద్వారా నిర్వహించబడుతున్నవి

**కాకినాడ బ్యూరో ఇంచార్జ్ సిటిజన్ టైమ్స్ మార్చి 24**

కాకినాడ జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వము నిర్ణయించిన కనీస మద్దతు ధర (ఎం ఎస్ పి) కు కొనుగోలు చేయుటకై ఏర్పాటు చేసిన ధాన్యము కొనుగోలు కేంద్రాలు రైతు సేవ కేంద్రాల ద్వారా నిర్వహించబడుచున్నవి . ఈ ధాన్యము సేకరణ ప్రక్రియ ఖరీఫ్ 2025--26 సీజన్ కు సంబంధించి 28-03-2026 తేదితో కొనుగోలు ముగియనున్నదని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు.కావున , రైతులు తమ వద్ద ఉన్న విక్రయించదలచిన ధాన్యాన్ని సమీపంలోని రైతు సేవ కేంద్రాలను సంప్రదించి, ప్రభుత్వము ప్రకటించిన కనీస మద్దతు ధరకు విక్రయించుకోవలసిందిగా తెలియజేసారు.కామన్ రకం ధాన్యాన్ని క్వింటాలుకు రూ. 2,369 / - ,గ్రేడ్ ' ఏ ' రకం ధాన్యం క్వింటాలుకు రూ . 2,389 / - చొప్పున తమ దగ్గర ఉన్న ధాన్యాన్ని విక్రయించుకొని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవలసిందిగా జాయింట్ కలెక్టర్ కోరారు.

# నాబార్డ్ అందించిన వాహనాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు



**కాకినాడ రిపోర్టర్ సిటిజన్ టైమ్స్ మార్చి 24**

డి.సి.సి.బి. ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందు కుగాను నాబార్డ్ అందించిన వాహనాల ద్వారా మెబైల్ ఎ.టి.ఎం ను ప్రజలకు చేరువచేస్తున్నట్లు డి.సి.సి.బి. చైర్మన్ తుమ్మల రామ స్వామి బాబు తెలిపారు.కాకినాడ నాగమల్లితోట జంక్షన్లో గల డి.సి.సి.బి. వద్ద నాబార్డ్ అందించిన వాహనాల ప్రారంబోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డి.సి.సి.బి సి.ఈ. వో, ప్రవీణ్ కుమార్ అధ్యక్షత వహించగా ఆప్కోబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు ముఖ్య అతిధిగాను డి.సి.సి.బి. చైర్మన్ తుమ్మల రామస్వామిబాబు విశిష్ట అతిధిగాను నాబార్డ్ జి.ఎం. కె.వి.ఎస్. ప్రసాద్ గౌరవ అతిధిగా పాల్గొన్నారు. మొబైల్ వెహికల్ ను ఆప్కోబ్ చైర్మన్ గన్ని వీరాంజనే యులు, తుమ్మల రామస్వామి బాబు కె.వి.ఎస్.ప్రసాద్ లు పూజా కార్యక్రమం నిర్వహించి రిబ్బన్ కత్తిరించి వాహనాలను ప్రారంబించారు. ఈ సందర్భంగా డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు మాట్లాడుతూ నాబార్డ్ నిధులతో జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ కి రికవరీ మొబైల్ వెహికల్స్ ఇవ్వడం చాలా సంతోషకరమని నష్టాలపాటిలో ఉన్న డిసిసి బ్యాంకు ను నాబార్డ్ మరియు ఆబ్కాపూర్ ఆదుకుని పూర్వవైభవం వచ్చి దిశగా కృషి చేయాలని దానికి ప్రతి ఒక్కరు సహకరించాలని తెలియజేశారు. అదేవిధంగా రైతులకు రుణాలు ఇవ్వడం సులభతరం అవు తుందని తద్వారా బ్యాంకు కి మన సంస్థకి గౌరవం దక్కుతుందని తెలియజేశారు. అనంతరం నూతన వాహనాలను వీరాం జనేయులు, రామస్వామిబాబులు డ్రైవ్ చేసి ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో డి.సి.సి.బి, నాబార్డ్ అదికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# విజయవాడ నగరంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవి నాయుడు ని మర్యాదపూర్వకంగా కలిసిన రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ జాయింట్ సెక్రటరీ కంటేపల్లి నరేంద్ర



**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 24**

ఇటీవల కాలంలో సాఫ్ చైర్మన్ రవి నాయుడు, రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ ఆర్ ఎస్ యు సమావేశంలో చేసినటువంటి సూచనల మేరకు డ్రగ్స్ పైన అవేర్నెస్ ప్రోగ్రాం విజయవంతంగా చేయడం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా అదేవిధంగా జాబ్ కేలండర్ విడుదల చేసినప్పుడు లోకేష్ కి రాష్ట్రవ్యాప్తంగా కృతజ్ఞతలు తెలియజేసినటువంటి రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ ఆర్ ఎస్ యు ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయడంలో రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి విద్యారంగ సమస్యల్లో రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ ఆర్ ఎస్ యు ముందుండి పోరాడుతుందని ఆంధ్రప్రదేశ్ క్రీడ పధికార సంస్థచైర్మన్ రవి నాయుడు కి వివరించడం జరిగింది. నరేంద్ర తోపాటు సర్ సివి రమణ స్కూల్ డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు ఆంధ్రప్రదేశ్ ప్రాధికార సంస్థ చైర్మన్ రవి నాయుడు గారిని కలిసి మే 9న జరిగే యాన్యువల్ డే కి ముఖ్యఅతిథిగా విచ్చేయాలని కోరడం జరిగిందని ఒక ప్రకటనలో తెలిపారు.

# క్రీడాకేంద్రంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

**తాడేపల్లిగూడెం:( సిటిజన్ టైమ్స్ ): మార్చి:24**

జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల మైదానాన్ని అన్ని రకాల క్రీడలకు కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని, త్వరలోనే పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొని వస్తామని శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వివిధ రకాల క్రీడల శిక్షణ కోసం అవసరమైన సామాగ్రిని ఏర్పాటు చేశామన్నారు.పేద విద్యార్థులకు క్రీడలలో శిక్షణ పొందటానికి అవకాశం ఉంటుందని అన్నారు. క్రీడా కారులుగా రాణిస్తే ఉద్యోగాలలో అవకాశం ఉంటుందన్నారు. తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యాభ్యాసం చేసి, పట్టణంలో, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో, దేశ విదేశాల్లో ఉన్నత స్థానాలకు ఎదిగారని అన్నారు. వారందరి సహకారంతో ఈ పాఠశాలను రాష్ట్రస్థాయి లో ఒక మోడల్ స్కూల్ గా అభివృద్ధి చేయాలనేది తమ సంకల్పమని అన్నారు. దశాబ్దాల క్రితం తేతలి రాజేశ్వరరావు సహకారంతో పాఠశాలను నిర్మించారని, గత కొన్ని సంవత్సరాలుగా పాఠశాల క్రీడామైదానం వర్షపు నీటితో మునిగిపోయి, బురద నీటితో దుర్గంధం వెదజల్లుతూ ఉండేదని అన్నారు. ఆ పరిస్థితి నుంచి నేడు సకల సౌకర్యాలతో పాఠశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. పాఠశాలలో సీసీ కెమెరాలు,విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం రక్షిత మంచి నీటి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు.ఎన్.వి. సత్యనారాయణ మిత్ర



బృందం,పాఠశాల ప్రధానోపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు,తదితరులు తన వద్ద పాఠశాల అభివృద్ధి గురించి ప్రతిపాదనలు చేశారన్నారు.తాను కూడా ఈ పాఠశాలలోనే చదివానని, పాఠశాల రుణం తీర్చుకోవాలనే లక్ష్యంతో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. పోలీసు శిక్షణకు అవసరమయ్యే క్రీడాంశాలను ఇక్కడ ఏర్పాటుచేసి, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పాఠశాలను ఆధునిక వసతులతో అభివృద్ధి చేస్తున్నామన్నారు.పాఠశాల అభివృద్ధి నివేదికను, పట్టణంలో నిర్మిస్తున్న ఈతకొలను, స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇండోర్ స్టేడియం తదితర అభివృద్ధి పనుల నివేదికను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల దృష్టికి తీసుకువెళ్లి,మరిన్ని నిధులు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ పాఠశాల



ఆవరణలోనే ఉన్న జూనియర్ కళాశాల కోసం మరోచోట భవనాన్ని నిర్మించి, పేద విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రైవేటు కళాశాలల్లో లక్షల రూపాయల ఫీజు చెల్లించ లేని విద్యార్థులకు కోసం జూనియర్ కళాశాలను నిర్మించాల్సిన అవసరం ఉందని అన్నారు.,ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి కళాశాల కోసం ప్రయత్నిస్తామని అన్నారు. నిజాయితీగా పనిచేసే వారికి ప్రజల సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ వి సత్యనారాయణ, జడ్పిటిసి ముత్యాల ఆంజనేయులు, చాపల రమేష్, అడ్డగర్ల సురేష్, పిడుగు రామ్మోహన్ బ్రదర్స్,జిల్లా పరిషత్ హై స్కూల్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీలకు అండగా కూటమి ప్రభుత్వం

**దెందులూరు:( సిటిజన్ టైమ్స్ ): మార్చి:24**

దెందులూరు నియోజకవర్గంలో ఒక్కొక్కటి రూ. 1,70,000/- విలువ గల 2 కె.వి సామర్థ్యం గల సోలార్ విద్యుత్ యూనిట్లను 4707 ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు 100శాతం సబ్సిడీపై ఉచితంగా అందించేందుకు సిద్ధం - దెందులూరు గ్రామంలో లబ్ధిదారుని ఇంటి వద్ద ఏర్పాటు చేసిన తొలి సోలార్ విద్యుత్ యూనిట్ను ప్రారంభించి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్. ఎస్సీ ఎస్టీల సంక్షేమానికి, అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం మరింత అండగా నిలుస్తుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఎస్సీ ఎస్టీలకు నూరు శాతం సబ్సిడీపై ఒక్క రూపాయి కూడా ఎటువంటి ఆర్థిక భారం వారిపై లేకుండా వారి ఇంటి వద్ద 2 కిలో వాట్స్ (2 కె.వి ) సామర్థ్యం గల సోలార్ విద్యుత్ యూనిట్లను ఉచితంగా అందిస్తున్న సందర్భంగా తొలి యూనిట్ను దెందులూరు మండలం దెందులూరు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారుల ఇంటి వద్ద మంగళవారం ఉదయం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గారు లాంచనంగా ప్రారంభించారు.లిఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గారు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీల సంక్షేమానికి వారి అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందని, ఎస్సీ ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ను అందించిన కూటమి ప్రభుత్వం తాజాగా ఎస్సీ ఎస్టీలకు దాదాపు రూ.1లక్ష 70వేల రూపాయల విలువైన రెండు కిలో వాట్స్ సామర్థ్యం కలిగిన 2 కేడబ్ల్యు సోలార్ విద్యుత్ యూనిట్లను వారికి నూరు శాతం సబ్సిడీపై అందిస్తూ ఇంటి వద్ద ఏర్పాటు చేయడం జరుగుతుందని, దెందులూరు నియోజకవర్గం లోని 4707 మంది ఎస్సీ



ఎస్టీ కుటుంబాలకు రాబోయే రోజుల్లో ఇదేవిధంగా సోలార్ విద్యుత్తు యూనిట్లను ఉచితంగా అందించనున్నట్లు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గారు తెలిపారు. అనంతరం దెందులూరు గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను సిసి రోడ్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే స్వయంగా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోట యేసమ్మ, విద్యుత్ శాఖ జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ సాల్మన్ రాజు, సహకార సొసైటీ చైర్మన్ గారపాటి కొండయ్య చౌదరి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్, బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యిప్పిలి వెంటేశ్వర రావు (వైవియార్), కూటమి నాయకులు కమ్మ శివరామ కృష్ణ, కూరపాటి రత్న కిశోర్, జనసేన నాయకులు మేడీది రిథ్వీ, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సంపంగి తిలక్, మండల తహసీల్దార్ బత్తిన సుమతి, ఎంపీడీవో ప్రతాప్, డి ఈ అంబేద్కర్ సహా పలువురు కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# పొదుపు సంఘాల మహిళా వ్యాపార అభివృద్ధికి సంపన్నకారి పథకం వరం లాంటిది

## జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి



**కాకినాడ రిపోర్టర్ సిటిజన్ టైమ్స్ మార్చి 24**

స్వయం సహాయక సంఘ సభ్యులతో అను సంధానమైన మహిళా వ్యాపార అభివృద్ధికి కొరకు రూపొందిం చబడిన ప్రత్యేకమైన సంపన్న కారి కార్యాక్రమం ఒక వరం లాంటిదని జిల్లా కలక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు . స్థానిక కలెక్టరేట్ లో మంగళవారం సంపన్న కారి కార్యక్రమానికి సంబందించిన పోస్టర్ ను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాల వ్యాపారాలు ఒక స్థాయి తర్వాత మరింత అభివృద్ధి చెందడానికి సరైన మార్గదర్శకం, వ్యాపార ప్రణాళికలు , మార్కెట్ అంశాలపై అవగాహన లేకపోవడం, పెట్టుబడికి వనరులు లేకపోతే ఆ వ్యాపారాన్ని విస్తరించడం కష్టం గా మారుతుందన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి రూపొందించిన కార్యక్రమమే " సంపన్న కారి " కార్యక్రమమని తెలిపారు . ఈ కార్యక్రమంలో ఎంపికైన స్వయం సహాయక సంఘ మహిళా వ్యాపార వేత్తలు అనగా 12 లక్షలు పైబడి టర్నోవర్ చేయుచున్న ( సర్వీస్ సెక్టర్ మరియు మ్యానిఫాక్చురింగ్ సెక్టార్ ) మహిళా సంఘ సభ్యురాలికి ఒక పద్దతిగా రూపొందించిన ఇంక్యుబేషన్ సహాయం పూర్తిగా ఉచితంగా అందిస్తామన్నారు . తద్వారా వ్యాపారాలను మార్కెట్ అనుగుణంగా మరింత ఆదాయం పెంచుకోవచ్చన్నారు . ఈ కార్యక్రమం ద్వారా ఎంపికైన వారికి కనీసం 18 నెలలు ఇంక్యుబేషన్ సహాయం అందించడంతో పాటూ లక్ష వరకు గ్రాంట్ లేదా నాలుగు లక్షల వరకు సున్నా వడ్డీ సదుపాయం మరియు వ్యాపార పరంగా శిక్షణ , మార్కెట్ అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు . కాకినాడ జిల్లాలో కూడా ఇందుకు అర్హత కలిగిన సంఘ సభ్యులు ఏప్రిల్ 15 వ తేదీలోగా సంబంధిత వెలుగు మండల మహిళా సమాఖ్య ఆఫీస్ లో ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులుజి.శ్రీనివాసరావు,అదనపు పథక సంచాలకులు జిలానీ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభావంతుల కోసం బ్యాక్ లాగ్ ఖాళీలను భర్తీ చేయుటకు ప్రత్యేక నియామక డ్రైవ్

**కాకినాడ రిపోర్టర్ సిటిజన్ టైమ్స్ మార్చి 24**

విభిన్న ప్రతిభా వంతుల, హిజ్రాల మరియు వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, జిల్లాలో గుర్తించబడిన విభిన్న ప్రతిభావంతుల కోసం బ్యాక్ లాగ్ ఖాళీలను భర్తీ చేయుటకు ప్రత్యేక నియామక డ్రైవ్ నిర్వహించ బడుతోందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు, గ్రూప్-×ు మరియు గ్రూప్-×ు పరిధి కానీ ఇతర పోస్టులు కింద ఉన్న మొత్తం 24 బ్యాక్ లాగ్ ఖాళీలను భర్తీ చేయుటకు జిల్లా స్థాయిలో గుర్తింపబడి, భర్తీ చేయుటకు గాను నోటిఫికేషన్ విడుదల చేయబడిందన్నారు. వాటి వివరాలు : 1) గ్రూప్ × కేటగిరీ - 11 పోస్టులు - : జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ - - 8, జూనియర్ అకౌంటెంట్ -1, టైపిస్ట్ - 2 / 2) గ్రూప్-పరిధి కానీ ఇతర కేటగిరీ -- 13 : ఆఫీస్ సబార్డినేట్ -- 8, స్వీపర్ -- 1, క్లీనర్ - 1, నైట్ వాచ్ మెన్ -- 1, పి.హెచ్. వర్కర్ -- 1, శానిటరీ మిస్త్రీ - 1 మొత్తం ఖాళీలు: 24. అందు విభిన్న ప్రతిభావంతుల వికలాంగుల కేటగిరీ వారీగా: (అంధత్వం) వారికి -- 7 పోస్టులు, ఎం (వినికిడి లోపం) వారికి - 12 పోస్టులు, వాం (లోకో మోటార్ వైకల్యం) వారికి -- 2 పోస్టులు, (ఆటిజం, నెమ్మది అభ్యాస వైకల్యం, మేధో వైకల్యం, మానసిక అనారోగ్యం ఉ బహుళ వైకల్యం ) వారికి -- 3 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయబడిందన్నారు.ఈ నోటిఫికేషన్ పూర్తి వివరాలు జిల్లా అధికారిక వెబ్సైట్లో అందుబాటులో ఉంచబడినవి: అనగా నందు అర్హత గల విభిన్న ప్రతిభావంత అభ్యర్థులు సౌకర్యార్థం అందుబాటులో ఉంచడమైనద న్నారు. నిర్ణీత అర్హతలు, సూచనలు పూర్తి వివరాలు అందుబాటులో ఉంచడమైనదన్నారు. నోటిఫికేషన్లో పేర్కొన్న విధంగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకి 0884- 2352303ఫోన్ నెంబర్లు సంప్రదించవచ్చానన్నారు.

**ముఖ్యమైన తేదీలు:** నోటిఫికేషన్ విడుదల: 24-03-2026 దరఖాస్తుల స్వీకరణ చివరి తేదీ: 18-04-2026 సా..5.00 గం వరకు. అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం జిల్లా వెబ్సైట్ను సందర్శించ వచ్చు.

# ఈనెల 26 నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రంలో ఎగుమతులను మరింత ప్రోత్సహించేందుకు 5వ రివర్స్ బయ్యర్-సెల్లర్ మీట్

**కాకినాడ బ్యూరో ఇన్చార్జ్ సిటిజన్ టైమ్స్ మార్చి 24**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎగుమతులను మరింత ప్రోత్సహించేందుకు 5వ రివర్స్ బయ్యర్-సెల్లర్ మీట్ (ఆర్ బి ఎస్ ఎన్) ఈ నెల 26 నుంచి 28 వరకు కాకినాడలో నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రము కాకినాడ జనరల్ మేనేజర్ సి.హెచ్ గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఆర్ యంటి ఫంక్షన్ హాల్లో జరిగే ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం, భారత ప్రభుత్వ వాణిజ్య మంత్రిత్వ శాఖకు చెందిన ఎఫ్ ఐ ఈ ఓ సంస్థతో కలిసి ఆర్ ఏ ఎం పి పథకం కింద నిర్వహిస్తోందన్నారు. ఈ మూడు రోజుల కార్యక్రమంలో 35కి పైగా అంతర్జాతీయ కొనుగోలుదారులు పాల్గొనసుండగా, వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్, టెక్స్టైల్స్ రంగాలకు చెందిన 300కు పైగా యం ఎస్ యం ఇ లు తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నాయన్నారు. ముఖ్యంగా, ఈ వేదిక ద్వారా స్థానిక యం ఎస్ యం ఈ లు విదేశీ బయ్యర్లను ప్రత్యక్షంగా కలుసుకుని, తమ ఉత్పత్తులను స్వయంగా పరిచయం చేసే ప్రత్యేక అవకాశం పొందనున్నారన్నారు. ఈ మీట్ ద్వారా కొత్త వ్యాపార సంబంధాలు ఏర్పడటంతో పాటు, అంతర్జాతీయ మార్కెట్లలో అడుగు పెట్టే అవకాశాలు మరింత విస్తరించనున్నా యన్నారు. స్థానిక సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక వేత్తలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వ్యాపారాన్ని తదుపరి స్థాయికి తీసుకెళ్లాలని నిర్వాహకులు సూచిస్తున్నారు. కావున జిల్లా లోని పారిశ్రామిక వేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని వారి వ్యాపార లబ్ధి కొరకు ఈ అవకాశాన్ని ఉపయోగించవలసిందిగా ఆయన కోరారు.

# ఘనంగా ప్రపంచం క్షయ వ్యాధి నివారణ దినోత్సవము...






**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మార్చి 24:**

ప్రపంచం క్షయ వ్యాధి నివారణ దినోత్సవమును సఖినేటిపల్లి మండల ఆరోగ్య సిబ్బంది ఘనంగా నిర్వహించారు. టి. బి అంతం మన పంతం లక్ష్యం గా ప్రజలు అవగాహనా కలిగి ఉండాలని, రెండు వారములు పైబడి దగ్గు, దగ్గినపుడు చాతి నొప్పి, రాత్రి వేళలో జ్వరం రావడం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్నవారు గ్రామంలో లోని ఏ. ఎన్. ఎం, లేదా ఎం. ఎల్. హెచ్. పి లకు తెలియజేస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్రము వద్ద కళ్ళె పరీక్ష లో వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు ఉచితంగా మందులు తీసుకోవడం వలన క్షయ వ్యాధిని పూర్తిగా తగ్గుతుందని సఖినేటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. పి. జయ గాయత్రి తెలియజేసారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రము నుండి సఖినేటిపల్లి లాక్ పేట వరకు టి.బి. వ్యాధి నివారణ స్లొగన్స్ తో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమములో సి హెచ్. లలిత, పి. ఎల్. ఎన్. స్వామి, ఎ. సరస్వతి హెల్త్ సూపర్ వైజర్స్, ఏ. ఎన్. ఎం లు, ఎం. ఎల్. హెచ్. పి లు, హెల్త్ అసిస్టెంట్స్, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# పాడి రైతులకు అండగా ఉచిత పశువైద్య శిబిరాలు

## ప్రభుత్వ పథకాలతో రైతులకు పూర్తి భరోసా -రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్





**కె గంగవరం సిటిజన్ టైమ్స్ మార్చి 24**

మండలం లోని ముసకపల్లి గ్రామంలో మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ మార్కెట్ కమిటీ ద్వారా నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాడి పశువుల కొనుగోలు, పశువుల పోషణ కోసం అవసరమైతే బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతులు, పాడి రైతుల సంక్షేమం కోసం అనేక పథకాల ద్వారా సహాయం అందిస్తున్నదని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. ఇటీవలే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుల ఖాతాల్లో రూ.20 వేల వరకు జమ చేయడం జరిగిందని తెలిపారు. అలాగే ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రెండు నుండి మూడు గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, కె గంగవరం మండలం ఎంపీపీ పంపన నాగమణి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సబ్బిత నాగేశ్వరి, మార్కెట్ కమిటీ సెక్రటరీ పి. వాసుదేవరావు, డైరెక్టర్లు, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలు, దడాల నాగార్జున, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, బలుసు శివప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు. పాడి రైతులకు సేవలు అందిస్తున్న పశు సంవర్ధక శాఖ సిబ్బందిని పలువురు అభినందించారు. ఈ శిబిరాన్ని డాక్టర్ ఓ. రామకృష్ణ పశుసంవర్ధక శాఖ ఏడి పర్యవేక్షణలో నిర్వహించగా, పేకేరు, కోటిపల్లి ప్రాంతాలకు చెందిన పశువైద్యులు డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ సంయుక్త లక్ష్మి సిబ్బంది రైతులకు వైద్య సేవలు అందించారు. ఈ ఉచిత పశువైద్య శిబిరంలో మొత్తం 66 పశువులకు వైద్య సేవలు అందించగా, 42 మంది రైతులు ఈ శిబిరం ద్వారా లబ్ధి పొందారు.

## అధిక దిగుబడులు విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడరాదు

### మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ రెడ్డి



**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్, మార్చి 24**

గిద్దలూరు మండలం లోని సంజీవరావు పేట గ్రామం లో మండల వ్యవసాయ అధికారి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం “ఆత్మ పథకం “ లో భాగంగా నేల ఆరోగ్యం, పోషకాలు యాజమాన్యం పై రైతుల కు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు . ఈ సందర్భంగా వ్యవసాయాధికారి విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ. ఈ ఆధునిక వ్యవసాయం లో అధిక దిగుబడుల కొరకు రైతులు విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు వాడుతున్నారని.రసాయనిక ఎరువులను పంటలలో అధికంగా వాడటం వల్ల భూమి యొక్క భౌతిక, రసాయన లక్షణాలు దెబ్బతింటాయని, ఇది నేల ఆరోగ్యం, పంట దిగుబడిపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. దీని వలన నేల ఆరోగ్యం దెబ్బతినడం,సూక్ష్మజీవుల నాశనం,భూమి చౌడుబారడం,పెట్టుబడుల పెరుగుదల,పర్యావరణ సమస్యలు మొదలైన అనేక నష్టాలు ఉన్నాయన్నారు. నివారణ మార్గాలైన సేంద్రియ ఎరువులు వాడటం, పచ్చిరొట్టెలు వేసి దున్నడం, పశువుల ఎరువు వాడటం వంటివి చేయడం ద్వారా నేలలో సేంద్రియ కర్బనం పెంచాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస రెడ్డి,శ్రీకాంత్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు శంకరమ్మ , రైతులు పాల్గొన్నారు.

## పి ఆర్ సి కమీషన్‌ను వెంటనే నియమించాలి

### యూ.టీ.ఎఫ్- గిద్దలూరు నియోజకవర్గ స్థాయి నిరాహార దీక్ష



**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్, మార్చి 24**

యూటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు పి ఆర్ సి కమిషన్ ను వెంటనే నియమించాలని, ఐ.ఆర్ 29 శాతాన్ని ప్రకటించాలని, పాత డిఏ బకాయిలు చెల్లించాలని, ఆర్థిక బకాయిలన్నింటినీ వెంటనే చెల్లించాలని, ఓ పి ఎస్ విధానాన్ని అమలు పరచాలని తదితర డిమాండ్స్ ను నెరవేర్చాలనే ఉద్దేశ్యంతో నిర్వహిస్తున్న రణభేరి 3.వా కార్యక్రమంలో భాగంగా గిద్దలూరు నియోజకవర్గ స్థాయిలో మంగళవారం ఉపాధ్యాయులు నిరాహార దీక్ష కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో యూటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఐ.వి.రామిరెడ్డి,రాష్ట్ర కౌన్సిలర్ పి.రమణారెడ్డి, జిల్లా మహిళా కార్యదర్శి వి.మాధవి, జిల్లా ఆడిట్ మెంబర్ యస్.శ్రీనివాసులు, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ వేమయ్య, సిపిఎస్ జిల్లా కన్వీనర్ ఆవుల రాజు, గిద్దలూరు, రాచర్ల, కొమరోలు ,కంభం, అర్ధవీడు,బి.పేట మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొని నిరసన తెలియజేశారు.ఈ కార్యక్రమానికి విశ్రాంత ఉద్యోగ సంఘ జిల్లా అధ్యక్షులు జి. రవీంద్రనాథ్ రెడ్డి, సంఘ బాధ్యులు సత్యనారాయణ రెడ్డి, బి.పాండు, భాస్కర్ రెడ్డి,సి.ఐ.టీ.యూ జిల్లా అధ్యక్షులు ఆవులయ్య తదితరులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

## చెస్‌లో సత్తా చాటిన విద్యార్థులు...



**పుల్లల చెరువు, సిటిజన్ టైమ్స్, మార్చి 24**

మార్కాపురం జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన తొలి చెస్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పుల్లల చెరువు మండలం శతకోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు.మండల స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో పలు విభాగాల్లో అగ్ర స్థానాలు కైవసం చేసుకుని ప్రత్యేక గుర్తింపు పొందారు.అండర్-19 బాలుర విభాగంలో బి. శివకృష్ణ ప్రథమ స్థానం సాధించగా, బాలికల విభాగంలో యల్. నయోమి ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. అలాగే అండర్-17 విభాగంలో వై. మణికంఠ ప్రథమ స్థానం, యు. రాజు ద్వితీయ స్థానం పొందారు.విద్యార్థుల విజయానికి శిక్షణ అందించిన ఇంటర్నేషనల్ రేటింగ్ ప్లేయర్, శతకోడు పాఠశాల గణిత ఉపాధ్యాయుడు పి. కుమారస్వామి, సహకరించిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు పి. బసవేశ్వరరావును మండల విద్యాశాఖ అధికారులు భాస్కర్, ఇందిరా ప్రసాద్ అభినందించారు.విజేతలు రాబోయే రాష్ట్రస్థాయి చెస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననున్నట్లు అధికారులు తెలిపారు.

## ఎరువుల వ్యాపారులతో నిర్వహించిన అవగాహన సదస్సు



**ఏలూరు జిల్లా :( సిటిజన్ టైమ్స్ ): మార్చి:24**

ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్ జంగారెడ్డిగూడెం ఏఎస్పీ సుస్మిత ఆర్, ఐపీఎస్ ఆదేశాల పై చింతలపూడి ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్, ధర్మాజీ గూడెం ఎస్ఐ వెంకన్న,లింగ పాలెం మండలంలోని ఎరువుల వ్యాపారుల తో నిర్వహించిన అవగాహన సదస్సు ను నిర్వహించారు.రైతుల సంక్షేమం మరియు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని, లింగ పాలెం మండలంలోని ఎరువులు మరియు పురుగుమందుల దుకాణదారు లతో స్థానిక పోలీస్ అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు వ్యాపారులకు ఈ క్రింది నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ప్రజల నుండి లేదా రైతుల నుండి ఎలాంటి అనధికారిక నగదు డిపాజిట్లు సేకరించ కూడదు. నాణ్యత లేని లేదా నకిలీ ఎరువులను విక్రయించి రైతులను మోసం చేయకూడదు. ఇలాంటి పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ప్రభుత్వం నిషేధించిన పురుగు మందులు లేదా రసాయనాలను స్టాక్ ఉంచడం గానీ, విక్రయించడం గానీ చేయకూడదు. ఎట్టి పరిస్థితు ల్లోనూ మైనర్లకు చిన్నపిల్లలకు ఎరువులు లేదా పురుగు మందులను అమ్మకూడదు. ఎవరైనా వ్యక్తి తీవ్రమైన మానసిక ఒత్తిడిలో ఉన్నట్లు కనిపించినా, లేదా బాధలో ఉండి పురుగుమందులు అడుగు తున్నట్లు గమనించినా.. వారికి మందులు విక్రయించ కుండా వారించడం ద్వారా ప్రాణాపాయాన్ని తప్పించాలి. అలాంటి అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలి. రహదారి భద్రతపై అవగాహన కేవలం వ్యాపారమే కాకుండా, సామాజిక బాధ్యతగా రహదారి భద్రతను పాటించాలని అధికారులు కోరారు. ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనం నడిపే టప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ జారీ చేసిన ఈ ఆదేశాలను ఉల్లంఘించే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు హెచ్చరించారు.

## వృద్దురాలి ఆస్తిని కాజేసిన చెల్లెలు కూతురు

# కలెక్టర్, ఎస్పీ లకు ఫిర్యాదు



**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మార్చి 24**

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా. ఆదరిస్తానని నమ్మించి 35 లక్షలు విలువ చేసే వృద్దురాలి ఆస్తి కాజేసిన చెల్లెలు కూతురు పైకటిన చర్యలు తీసుకోని, నాకు న్యాయం చేయాలంటూ జిల్లా కలెక్టర్, ఎస్పీ లకు ఫిర్యాదు చేశారు. రక్త సంబంధీకులు, వరుస బంధువులు మోసం చేసి ఆస్తి కాజేస్తున్న ఘటనలు ఇటీవల తరచు వెలుగులోకి వస్తున్నాయి. మభ్యపెట్టి వృద్దాప్యంలో ఉన్న తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చి తప్పుడు రిజిస్ట్రేషన్ లు చేయించుకుని, వృద్దులను బయటకు నెట్టేయడం వంటి ఘటనలు పెరిగిపోతున్నాయి. దాదాపు ఇలాంటి సంఘటనే కోనసీమ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సఖినేటిపల్లి మండలం గొంది గ్రామంలో ఒడుగు సుభద్రమ్మ (80) చిన్న చిన్న వ్యాపారుల వద్ద చేపలు, రొయ్యలు కొని ఇంటింటికీ తిరిగి అమ్ముకుని జీవనం సాగిస్తున్న మత్స్యకార వృద్ధురాలు. ఈమె భర్త కొద్ది సంవత్సరాల క్రితమే చనిపోయారు. ఈమె సంసార జీవితంలో ఈమెకు పిల్లలు కలుగలేదు. దీంతో తన సొంత చెల్లెలు కొడుకు రామకృష్ణ ను చిన్నప్పుడే తెచ్చి పెంచుకుని, పెండ్లి చేసింది. వివాహానంతరం రామకృష్ణ అతని భార్య జీవనోపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్ళిపోయారు. దీంతో ఒంటరిగా ఉంటున్న వృద్దురాలు సుభద్రమ్మ ఆలనా పాలనా చూసుకుంటానని, చెల్లెలు కూతురు, రామకృష్ణ చెల్లెలు సుభద్రమ్మ కు దగ్గరయ్యింది. కరోనా సమయంలో తీవ్ర జ్వరంతో ఉన్న తనకు వైద్యం చేయిస్తానని, మలికిపురం సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ కి తీసుకెళ్లి వృద్దురాలి పేరున ఉన్న ఎకరం పంట పొలం, పెంకుటిల్లు సహా 14 సెంట్ల మెరక భూమి రాజ్యలక్ష్మి పేరున,ఆమె కుమారుని పేరిట అమ్మి వేసినట్లు రిజిస్ట్రేషన్ చేయించేసుకుందని, సుభద్రమ్మ కన్నీటి పర్యంతం అవుతుంది. ఈ ఇల్లు మల్లాడి రాజ్యలక్ష్మి పేరున ఉందని, ఇటీవలే ప్రైవేట్ బ్యాంకర్స్ ఈ ఇంటిపై ఐదు లక్షల అప్పు ఉందని, తీర్చకపోతే వేలం వేస్తామని చెప్పే వరకు తన చెల్లెలు కూతురు తనకు చేసిన నమ్మక ద్రోహం తెలియదని, లబోదిబో మంటు ఏడ్వ సాగింది. ఒంటరిగా ఉంటున్న తను ఇంటి ఎదురుగా ఉన్న పంట కాలువలో ఎన్నో సార్లు పడిపోయి చావు బతుకుల మధ్య కొట్టిమిట్టాడానని ఆవేదన వెలిబుచ్చింది. తనకు జరిగిన అన్యాయం పై జిల్లా కలెక్టర్, ఎస్పీ లకు ఫిర్యాదు చేసానని, ఏలిన వారు తనయందు దయచూపి తన ఆస్తి తనకు వచ్చేలా చేస్తారని, తనను మభ్యపెట్టి, మోసం చేసిన తన చెల్లెలు కూతురు రాజ్యలక్ష్మి, ఆమె కుమారుడు గణేష్, వీరికి సహకరించిన అధికారులు అందరిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుకుంటుంది.

## జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన




**కంభం సిటిజన్ టైమ్స్, మార్చి 24**

కంభం టీ బి యూనిట్ ఆధ్వర్యంలో గవర్నమెంట్ హాస్పిటల్ నుంచి ర్యాలీగా బయలుదేరి కందులాపురం సెంటర్ లో మానవ హారం నిర్వహించ బడినది. ఈ కార్య కార్యక్రమం లో డాక్టర్ రమేష్ డాక్టర్ కావ్య శిరీష టీ బి యూనిట్ సూపర్ వైజర్ కె శ్రీనివాస్ రెడ్డి యం ఎల్ హెచ్ పి లు ఏ యన్ ము లు ఆశ కార్య కర్తలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్య క్రమం యొక్క ముక్య ఉద్దేశ్యం ప్రజలకు అవగాహన కల్పించారు 2 వారాలపాటు జ్వరం పొడి దగ్గు బరువు తగ్గటం రాత్రి పూట ఏ క్కువ గా చమటలు పట్టడం అలా ఉన్నవారు వచ్చి పరీక్షలు చేపించు కోవలెను నని తెలియ జేశారు. పాజిటివ్ అని తేలిన వారికి ఉచితంగా మందులు ఇవ్వబడును అని తెలియ జేయడం జరిగింది.

## నీటి నాణ్యత పరిశీలనకు ప్రత్యేక శిక్షణ

### ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మోహన్ రావు



**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్, మార్చి 24**

నీటి నాణ్యత పై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులకు, ఏం ఎల్ హెచ్ పి లకు శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది ఈ సందర్భంగా నీటి నాణ్యత పై వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరిగింది ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మోహన్ రావు మాట్లాడుతూ గ్రామాల్లో నీటి నాణ్యత పరిశీలనకు ఎఫ్ టీ కే కిట్లను ఉపయోగించి నీటిలోని నాణ్యతను పరిశీలించడం జరుగుతుందన్నారు ప్రతి గ్రామపంచాయతీలో ఈ కిట్ల ద్వారా నీటి నాణ్యతను పరిశీలించి అవి త్రాగడానికి ఉపయోగపడుతున్నాయో లేదో పరీక్షించవలసి ఉంటుందన్నారు త్రాగటానికి ఉపయోగకరంగా లేనిగ్రామాల్లో ఆర్వోప్లాంట్లను అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బ్రహ్మయ్య డిప్యూటీ ఎంపీడీవో బ్రహ్మానంద రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ సేవా పత్రం అందుకున్న శ్రీనివాసరావు

**పొన్నలూరు, సిటిజన్ టైమ్స్, మార్చి 24**

ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా ఒంగోలు , రిమ్స్ హాస్పిటల్ లో జరిగిన కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్నత సేవలు అందించిన వారికి ఉత్తమ సేవా పురస్కార పత్రాలు అందించారు. జిల్లా స్థాయి అధికారులతో పాటు.. ఆశా కార్యకర్త, ఏఎన్ఎం , ల్యాబ్ టెక్నీషియన్ హెల్త్ సూపర్ వైజర్ లకు అవార్డు ప్రధాన చేశారు.పొన్నలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన హెల్త్ సూపర్వైజర్ జి. శ్రీనివాసరావు కు క్షయ వ్యాధి నివారణలో ఉత్తమ సేవలు అందించిన క్యాటగిరిలో ఉత్తమ సేవ పత్రాన్ని ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ల వెంకటేశ్వర్లు టీబీ ప్రత్యేక అధికారి డాక్టర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత ధనవంతుల జాబితాలో సౌత్ లేడీ స్టార్స్.. హైయెస్ట్ ఎవరంటే?

సినీ ఇండ్రస్ట్రీ లో కథానాయికలు కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, బాక్సాఫీస్ వద్ద తమకంటూ ఒక ప్రత్యేక మార్కెట్‌ను సృష్టించుకున్నారు. సంపాదనలో కూడా హీరోలకు గట్టి పోటీనిస్తూ భారీ ఆస్తులను కూడబెడుతున్నారు. నయనతార నుంచి సమంత వరకు, రష్మిక మందన్న నుంచి త్రిష వరకు టాప్-7 ధనవంతులైన నటీమణుల జాబితా ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. మార్చి 2026 నాటి అంచనాల ప్రకారం వీరి నికర ఆస్తుల విలువ ఎంత వుందో తెలిస్తే ఆశ్చర్యపోతారు. మరి ఆ వివరాలు చూద్దాం..

**అగ్రస్థానంలో లేడీ సూపర్ స్టార్ నయనతార:**

సౌత్ ఇండియాలోనే అత్యంత ధనవంతురాలైన నటిగా నయనతార మొదటి స్థానంలో నిలిచారు. 41 ఏళ్ల ఈ 'లేడీ సూపర్ స్టార్' నికర ఆస్తి విలువ ప్రస్తుతం రూ. 200 కోట్లకు పైగానే ఉన్నట్లు సమాచారం. ఇక ఫోర్బ్స్ ఇండియా సెలబ్రిటీ లిస్టులో చోటు దక్కించుకున్న ఏకైక సౌత్ నటిగా ఆమె రికార్డు సృష్టించారు. ఆమె తర్వాత 'బాహుబలి' ఫేమ్ అనుష్క శెట్టి రూ. 135 కోట్లతో రెండో స్థానంలో ఉన్నారు. స్వీటీ ఒక్కో సినిమాకు రూ. 5 నుంచి 7 కోట్ల వరకు రెమ్యునరేషన్ తీసుకుంటూ తన హవా కొనసాగిస్తోంది.

**తమన్నా, సమంతల మధ్య గట్టి పోటీ:**






ఇక మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా, స్టార్ బ్యూటీ సమంత రూత్ ప్రభు ఇద్దరూ దాదాపు సమానమైన ఆస్తులతో తర్వాతి స్థానాల్లో నిలిచారు. తమన్నా నికర ఆస్తి రూ. 110-120 కోట్లు ఉండగా, ఆమె ఒక్కో సినిమాకు రూ. 4 నుంచి 5 కోట్లు వసూలు చేస్తోంది. ఇక సమంత కూడా రూ. 110-120 కోట్ల ఆస్తులతో ఆమెకు గట్టి పోటీనిస్తోంది. సమంత క్రేజ్‌ను బట్టి ఒక్కో ప్రాజెక్టుకు రూ. 3 నుంచి 8 కోట్ల వరకు తీసుకుంటోంది. వీరిద్దరూ సినిమాలతో పాటు బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ ద్వారా కూడా భారీగా సంపాదిస్తున్నారు.


**సీనియర్ భామల సత్తా.. త్రిష, కాజల్:**

ఇక రెండు దశాబ్దాలుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్న త్రిష కృష్ణన్, కాజల్ అగర్వాల్ కూడా ఈ జాబితాలో టాప్ లో ఉన్నారు. త్రిష ఆస్తుల విలువ రూ. 85 నుంచి 100 కోట్ల మధ్య ఉండవచ్చని అంచనా. ఇక 40 ఏళ్ల కాజల్ అగర్వాల్ కూడా తన టోటల్ కెరీర్‌లో రూ. 85 కోట్ల వరకు ఆస్తులను కూడబెట్టుకున్నారు. అప్పట్లో 'మగధీర' వంటి సినిమాలతో టాప్ రేంజ్‌కు వెళ్లిన కాజల్, పెళ్లయ్యాక కూడా మంచి ప్రాజెక్టులతో బిజీగా ఉంటూ తన ఆర్థిక స్థితిని పటిష్టంగా ఉంచుకున్నారు.


**నేషనల్ క్రష్ రష్మిక దూకుడు:**

ప్రస్తుతం పాన్-ఇండియా లెవల్లో ఫుల్ డిమాండ్ ఉన్న నటి రష్మిక మందన్న. కేవలం 29 ఏళ్ల వయసులోనే ఆమె రూ. 66 కోట్ల ఆస్తులను సంపాదించారు. 'పుష్ప 2' కోసం రూ. 10 కోట్లు, సల్మాన్ ఖాన్ 'సికిందర్' కోసం ఏకంగా రూ. 13 కోట్లు తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇటీవల వివాహం చేసుకున్న రష్మిక, ఈ జాబితాలో అందరికంటే చిన్న వయసులోనే కోట్లకు పడగలెత్తిన నటిగా నిలిచింది.

భవిష్యత్తులో ఆమె ఆస్తుల విలువ ఇంకా పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.సౌత్ లేడీ స్టార్స్ తమ కష్టంతో మరియు టాలెంట్‌తో ఈ స్థాయికి చేరుకోవడం నిజంగా అభినందనీయం. కేవలం సినిమాలే కాకుండా వ్యాపార రంగంలో కూడా పెట్టుబడులు పెడుతూ తమ ఆర్థిక భవిష్యత్తును ప్లాన్ చేసుకుంటున్నారు. ఈ జాబితా చూస్తుంటే దక్షిణాది నటీమణుల స్టార్ పవర్ బాలీవుడ్ భామలకు ఏమాత్రం తీసిపోదని అర్థమవుతోంది.




శ్రీముఖి యొక్క బోల్డ్ మ్యాడ్‌నెస్: "మేడ్ ఫర్ ఈచ్ అదర్" వైబ్స్



ప్రతిభా రంతా యొక్క రాయల్ ప్రకాశం: జాతి సంపద

## చిన్నస్వామి స్టేడియంలో తొక్కిసలాట.. ఆ 11 మందికి స్టేడియంలో పర్మినెంట్ ప్లేస్



ఐపీఎల్ 2025 విజయోత్సవ వేడుకల్లో చనిపోయిన ఫ్యాన్స్ కోసం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కీలక నిర్ణయం తీసుకుంది. కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ) సహకారంతో చనిపోయిన అభిమానుల పేర్లపై స్టేడియంలో శాశ్వత సీట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. కాగా ఐపీఎల్ 2026 సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో ఆర్సీబీ చిన్నస్వామి స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తొలి మ్యాచ్ ఆడబోతుంది. ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు స్టేడియం ప్రవేశ ద్వారం దగ్గర 11 మంది ఫ్యాన్స్ మృతుల జ్ఞాపకార్థం ఒక స్మారక ఫలకాన్ని ఆవిష్కరించబోతుంది. అంతేకాదు, స్టేడియంలోని 11 సీట్లను శాశ్వతంగా వారి పేరుపై రిజర్వ్ చేసి.. ఎల్లప్పుడూ ఖాళీగా ఉంచాలని నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులో ఇక్కడ జరిగే అంతర్జాతీయ మ్యాచ్‌లు సహా అన్ని ఈవెంట్లలో ఈ సీట్లు ఖాళీగానే కనిపిస్తాయని అధికారులు తేల్చి చెప్పారు. 11 మంది అభిమానుల జ్ఞాపకార్థం 11వ నెంబర్ ప్రాక్టీస్ జెర్సీలను ప్లేయర్స్, సపోర్ట్ స్టాఫ్ ధరించొద్దన్నారు. ఈ విషయాన్ని ఆర్సీబీ సీఈవో రాజేష్ మీనన్ ఇవాళ తెలియజేశారు. ఇది మా ప్రయాణంలో మాతోనే నడిచిన మా ఫ్యాన్స్ కోసం మేము అర్పించే నివాళి అన్నారు. మ్యాచ్ రోజు ఆటగాళ్లంతా నల్లని కళ్లద్దాలను కూడా ధరిస్తారని పేర్కొన్నారు.

ఐపీఎల్ 2025లో జరిగిన ఫైనల్లో పంజాబ్ కింగ్స్‌ను ఓడించి ఆర్‌సీబీ విజేతగా నిలిచింది. 18 ఏళ్ల తర్వాత ట్రోఫీని గెలవడంతో ఆర్సీబీ ఫ్యాన్స్ ఆనందానికి హద్దేలేకుండా పోయింది. జూన్ 4న బెంగళూరులో నిర్వహించిన విజయోత్స వేడుక తీవ్ర విషాదంగా మారింది. ఈ విజయోత్స వేడుకలను చూసేందుకు లక్షల్లో అభిమానులు తరలిరావడంతో చిన్నస్వామి స్టేడియం వెలుపల తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా.. 50 మంది గాయపడ్డారు. చనిపోయిన వారిలో చిన్నారులతో పాటు మహిళలు కూడా ఉన్నారు.

## అమ్ముడుపోయిన రాజస్థాన్ రాయల్స్.. ఏకంగా రూ. 15 వేల కోట్లకు..




ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత భారీ డీల్ నమోదు అయింది. రాజస్థాన్ రాయల్స్ జట్టు అమ్మకం ప్రక్రియ ఎట్టకేలకు పూర్తైంది. భారత సంతతికి చెందిన అమెరికన్ పారిశ్రామికవేత్త కల్ సోమాని నేతృత్వంలోని కన్సార్టియం, ఈ జట్టును 1.63 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేసినట్లు జాతీయ మీడియాలో వార్త కథనాలు వస్తున్నాయి. ఇండియన్ కరెన్సీలో దీని విలువ సుమారు రూ. 15,280 కోట్ల వరకు ఉంటుంది. దీంతో ఒక బిలియన్ డాలర్లకు విక్రయించిన తొలి ఐపీఎల్ జట్టుగా రాజస్థాన్ చరిత్ర సృష్టించింది.

**అధికారికంగా జట్టు బాధ్యతలు:**

ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన తర్వాత ఈ కొత్త యాజమాన్యం జట్టు బాధ్యతలను అధికారికంగా చేపట్టనుంది. గతంలో ఆర్‌పీఎస్‌జీ గ్రూప్ లక్నో సూపర్ జెయింట్స్‌ను 940 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేయగా, ఇప్పుడు రాజస్థాన్ ఆ రికార్డును అధిగమించింది. అయితే కల్ సోమాని కన్సార్టియానికి వాల్‌మార్ట్ ఫ్యామిలీకి చెందిన అమెరికన్ వ్యాపారవేత్త రాబ్ వాల్టన్, అలాగే ఎన్‌ఎఫ్‌ఎల్ జట్టు డెట్రాయిట్ లయన్స్‌లో మెజారిటీ వాటాలు కలిగిన హాంప్ కుటుంబం నుంచి ఆర్థికంగా సపోర్టు ఉంది.

**ఎవరీ కల్ సోమాని?:**

అరిజోనాకు చెందిన కల్ సోమాని ఒక ప్రముఖ ఎంట్రప్రెన్యూర్. ఆయనకు డేటా ప్రైవసీ, ఎడ్‌టెక్ , క్రీడా సాంకేతికత లాంటి రంగాల్లో 15 ఏళ్లకు పైగా అనుభవం కలిగి ఉన్నారు. అతడు ఇంట్రాఎడ్జ్, ట్రూయో వంటి సంస్థలకు వ్యవస్థాపకుడిగా కొనసాగుతున్నారు. 2021 నుంచే ఆయనకు రాజస్థాన్ రాయల్స్‌లో మైనారిటీ వాటాని కలిగి ఉన్నారు. తాజాగా ఇప్పుడు 100 శాతం వాటాను దక్కించుకున్నారు. క్రీడల పట్ల ఇంట్రెస్ట్ ఉన్న సోమాని.. మోటార్ సిటీ గోల్ఫ్ క్లబ్‌కు సహ-యజమానిగా, TGL గోల్ఫ్ లీగ్‌లలో తొలి పెట్టుబడిదారులలో ఒకరిగా ఉన్నారు.

## ఎస్ఆర్‌హెచ్ vs ఆర్సీబీ మ్యాచ్‌కి బిగ్ షాక్.. ఆరోజు వర్షం పడే ఛాన్స్!




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ అత్యంత ఉత్కంఠభరితమైన పోరుతో ప్రారంభం కానుంది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య మార్చి 28వ తేదీన రాత్రి 7:30 గంటలకు ఈ హై-వోల్టేజ్ మ్యాచ్ జరగనుంది. కాగా ఈ మ్యాచ్‌పై నీలి నీడలు కమ్ముకునేలా కనిపిస్తున్నాయి. మార్చి 28వ తేదీన బెంగళూరులో వర్సం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఒకవేళ ఆరోజు వర్షం అంతరాయం కలిగించకుండా ఉంటే, ఈ మ్యాచ్ ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఉత్కంఠభరితమైన ఓపెనింగ్ మ్యాచ్‌లలో ఒకటిగా నిలుస్తుంది.

**గెలిచే అవకాశం ఎవరికి?:**

గణాంకాల ప్రకారం, సొంత గడ్డపై ఆడుతుండటంతో ఆర్సీబీకి 54 శాతం గెలిచే అవకాశం ఉండగా, ఎస్ఆర్‌హెచ్‌కు 46 శాతం ఛాన్స్ ఉంది.

ూ=ు దూకుడు: హైదరాబాద్ జట్టులో ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ వంటి విధ్వంసకర ఓపెనర్లు ఉన్నారు. హెన్రిచ్ క్లాసెన్, ఇషాన్ కిషన్, లియామ్ లివింగ్‌స్టోన్‌లతో హైదరాబాద్ బ్యాటింగ్ లైన్-అప్ చాలా బలంగా ఉంది. మ్యాచ్ ప్రారంభమైన తొలి ఓవర్ నుంచే అటాకింగ్ గేమ్‌ను ఆడటమే వీరి ప్రధాన వ్యూహంగా ముందుకు వెళ్తున్నారు.

RCB **బలం:** సొంత గడ్డపై ఆడుతుండటం ఆర్సీబీకి కలిసొచ్చే అంశం. విరాట్ కోహ్లీ, ఫిలిప్ సాల్ట్ ఓపెనింగ్ జోడీపై భారీ అంచనాలు పెట్టుకుంది ఆర్సీబీ యాజమాన్యం. మిడిల్ ఆర్డర్‌లో రజత్ పాటిదార్, జితేష్ శర్మ, టిమ్ డేవిడ్ వంటి పవర్‌ఫుల్ హిట్టర్లు ఉన్నారు.

**పిచ్ రిపోర్ట్:**

బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియం ఎప్పుడూ బ్యాటర్లకు స్వర్గధామం అని చెప్పాలి. ఇక్కడ 180 పరుగులు కూడా సాధారణ స్కోరుగా పరిగణించబడుతుంది. ఒకవేళ 200ం దాటితే అది గెలిచేందుకు భావించే స్కోర్ గా పేర్కొంటారు. ఈ మైదానంలో చిన్న బౌండరీలు ఉండటంతో సిక్సర్ల వర్షం ఖాయం.

**వెదర్ రిపోర్ట్:**

పగటిపూట గరిష్టంగా 34 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

సాయంత్రం వేళ 60 శాతం వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తుంది.

మార్చి 28న సాయంత్రం గంటకు 30 కిలోమీటర్ల వేగంతో వీచే గాలులు, పిడుగులతో కూడిన వర్షం మ్యాచ్‌కు ఆటంకం కలిగించే అవకాశం ఉంది.

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు అంచనా:** ఫిలిప్ సాల్ట్, విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, రజత్ పాటిదార్ (కెప్టెన్), జితేష్ శర్మ (వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, రొమారియో షెపర్డ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, జాకబ్ డఫీ, మంగేష్ యాదవ్

**సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు అంచనా:** అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్ (కెప్టెన్/వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, హెన్రిచ్ క్లాసెన్, అనికేత్ వర్మ, హర్షల్ పటేల్, లియామ్ లివింగ్‌స్టోన్, జీషన్ అన్సారీ, ఈషన్ మలింగ, జయదేవ్ ఉనద్కత్

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776